ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

బాపట్ల జిల్లా వార్తలు

5

బుధవారం 7 మే 2025





ఉష్ణోగ్రత (అంచనా)

7-5-2025	గరిష్ఠం	కనిష్ఠం
గుంటూరు	39	27
తెనాలి	38	27
నరసరావుపేట	39	27
బాపట్ల	37	27
రెంటచింతల	39	27
చీరాల	37	27

బర్లీ కొనేవారేరి?



● ఉప్పుటూరు గ్రామంలో పొగాకు బేళ్లు

- సరైన ధర లేక రైతుల ఆవేదన
- కొనుగోళ్లకు ముందుకు రాని వ్యాపారులు
- మూడు జిల్లాలో 96 వేల ఎకరాల సాగు
- ఆదుకోవాలని బర్లీ పొగాకు రైతుల వేడుకోలు

(బాపట్ల, పర్చూరు ఆంధ్రజ్యోతి)

ఆశాజనకంగా దిగుబడులు.. మార్కెట్‌లో మంచిధర.. సంప్రదాయ పంటల సాగుతో పోల్చుకుంటే లాభాలతో.. ఇటు బాపట్ల జిల్లాలో అత్యధికంగా, అటు పల్నాడు, గుంటూరు జిల్లాలో కొంతమేర రైతులు ఈ సీజన్‌లో బర్లీ పొగాకు సాగు బాట పట్టారు. పత్తి, మిర్చి పంటల సాగుకు ఎక్కువ పెట్టుబడి అవుతుండడంతో పాటు దిగుబడులు అంతంతమాత్రంగా ఉండడంతో వాటిని కాదని బర్లీ సాగు వైపు పెద్దసంఖ్యలో రైతులు ఆకర్షితులయ్యారు. ఈ పరిస్థితుల్లో గతేడాదితో పోలిస్తే సాగు రెట్టింపయినట్లు గణాంకాలు చెబుతున్నాయి. గంపెడాశలతో సాగు చేపట్టిన రైతులు ప్రస్తుతం బర్లీ పొగాకు కొనే దిక్కు లేక అల్లాడుతున్నారు. గడచిన రెండేళ్లతో పోలిస్తే దిగుబడుల్లో 30 శాతం క్షీణత నమోదు కాగా ధర అమాంతం సగానికి సగం పడిపోవడంతో రైతుల కుదేలయ్యారు. ధర విషయంలో పరిష్కారం చూపి ఆదుకోవాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. పర్చూరు మండలం వీరన్నపాలెం గ్రామానికి చెందిన పొగాకు కౌలు రైతు ఒకరు మంగళవారం ఆత్మహత్య చేసుకోవడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది. ప్రభుత్వం ఆదుకోకపోతే ఆత్మహత్యలే శరణ్యమని రైతులు వాపోతున్నారు.

గతేడాది క్వింటా రూ.16,000 వరకు

గతేడాది బ్లాక్, వైట్ బర్లీ పొగాకు ధర క్వింటా రూ.16,000 వరకు పలికింది. వ్యాపారులు అడ్వాన్సులు ఇచ్చి మరీ బుక్ చేసుకున్నారు. ఈ నేపథ్యంలో రైతులు ఇతర పంటలను కాదని బర్లీ పొగాకు సాగు వైపు గణనీయంగా మళ్లడంతో పొగనారుకు పెద్దఎత్తున డిమాండ్ కూడా ఏర్పడింది. గతేడాది బాపట్ల జిల్లాలో బర్లీ సాగు 40,000 ఎకరాలకు పరిమితమైతే ఈ ఏడాది అది దాదాపు 70,000 వరకు పెరిగింది. గుంటూరు, పల్నాడు జిల్లాల్లో సైతం 26,000 ఎకరాల వరకు సాగైంది. ప్రస్తుతం 96 వేల ఎకరాల్లో దిగుబడులు వస్తున్నాయి. అయితే ధర క్వింటాలకు పదివేలకు దిగువనే ఉంది. పైగా దిగుబడులు కుచించుకుపోవడం, అకాల వర్షాలు గోరుచుట్టు మీద రోకలిపోటులా మారడంతో రైతులు దిక్కుతోచని పరిస్థితుల్లో ఉన్నారు. అయినకాడికి అమ్ముకుందామన్నా వ్యాపారులు కన్నెత్తి చూడటంలేదని రైతుల ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ పరిస్థితుల్లో ప్రభుత్వం తీసుకునే చర్యల మీదే ఆశతో రైతులు ఎదురుచూస్తున్నారు.

ప్రభుత్వ ఆదేశాలు పట్టని వ్యాపారులు

బర్లీ పొగాకు, నాటు పొగాకు తమ పరిధిలోకి రావని పొగాకు బోర్డు చేతులెత్తేసింది. రైతులను ఆయా కంపెనీల దయదాక్షిణ్యాల మీదనే వదిలేసింది. వర్జీనియా పొగాకు సాగు చేస్తున్న రైతులకు టుబాకో బోర్డు కొన్ని ప్రత్యేక రక్షణలు కల్పిస్తున్నది. కానీ అవేవీ కూడా బర్లీ పొగాకు రైతులకు వర్తించకపోవడమే ప్రస్తుత దుస్థితికి కారణంగా ఉంది. పొగాకు బోర్డు చేతులెత్తేయడంతో రెండు వారాల క్రితమే ప్రభుత్వం రంగంలోకి దిగింది. ఆయా కంపెనీల ప్రతినిధులతో సమావేశాలు నిర్వహించి రైతులకు న్యాయం చేయాలని సూచించింది. కానీ క్షేత్రస్థాయిలో ఆ నిర్ణయాలు అమలు చేయడంతో వ్యాపారుల నిర్లక్ష్యం బర్లీ రైతులకు శాపంగా పరిణమించింది. ప్రభుత్వం వైపు నుంచి కంట్రోల్ రూం ఏర్పాటు చేయడం మొదలుకుని వ్యవసాయశాఖ ముఖ్య కార్యదర్శిని క్షేత్రస్థాయి పర్యటనకు పంపినా వ్యాపారుల్లో చలనం లేదు. గతంలో లాభాల పంట పండించుకున్న కంపెనీలు ప్రస్తుతం ఈ సమస్య తమది కాదన్నట్లుగా వ్యవహరిస్తున్నాయి.

కొనుగోలు చేసేలా చర్యలు

వ్యవసాయశాఖ ముఖ్య కార్యదర్శి రాజశేఖర్

బర్లీ రైతులు ఆధైర్య పడాల్సిన అవసరం లేదని, ప్రభుత్వం అండగా ఉంటుందని రాష్ట్ర వ్యవసాయ శాఖ ముఖ్య కార్యదర్శి రాజశేఖర్ తెలిపారు. బాపట్ల జిల్లా పర్చూరు మండలం, ఉప్పుటూరు గ్రామంలో మంగళవారం ఆయన పొగాకు రైతులతో ముఖాముఖి నిర్వహించారు. వ్యవసాయశాఖ కమిషనర్ ఢిల్లీరావుతో కలసి క్షేత్రస్థాయిలో పొగాకు తోటలను అధికారులతో కలసి పరిశీలించి రైతులతో మాట్లాడారు. అనంతరం గ్రామంలోని జడ్పీ హైస్కూల్‌లో ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

నీటి సంఘాలు.. నిర్వీర్యం

ఉత్సవ విగ్రహాల్లా నీటి సంఘాల అధ్యక్షులు

- వారి అధికారాలను హరిస్తోన్న అధికారులు
- సమావేశాల ఏర్పాటుకు ఇష్టపడని జలవనరులశాఖ
- కాల్వల మరమ్మతులు.. నీటి పంపిణీలో భాగస్వామ్యం లేదాయే

నిధులు.. అధికారాలు లేవు

రైతులు ఏటా చెల్లించే నీటి తీరువాలో 80 శాతం నిధులను నీటి సంఘాలకు కేటాయించాలి. ఈ ప్రక్రియను అమలు చేసే పరిస్థితులు కానరావడంలేదని అధ్యక్షులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సాగునీటి వినియోగదారుల సంఘాలు, డిస్ట్రిబ్యూటరీ కమిటీలు, ప్రాజెక్టు కమిటీలకు నిర్దిష్టమైన అధికారాలను ప్రభుత్వం కల్పించినా వాటిని కొందరు హరిస్తున్నారన్న ఆరోపణలున్నాయి. పైగా అధికారుల తీరు సంఘాలను అవమానించేలా ఉన్నాయన్న విమర్శలున్నాయి.



లింగంగుంట్లలోని జలవనరుల శాఖ కార్యాలయాలు

కార్యాలయాలు అప్పగించలేదు

ప్రపంచ బ్యాంకు నిధులతో సాగర్ కాల్వల ఆధునికీకరణ పనులు చేశారు. ఈ సందర్భంగా కార్యాలయాల నిర్మాణానికి నిధులు కేటాయించారు. ఈ నేపథ్యంలో డిస్ట్రిబ్యూటరీ కమిటీలకు చాలా చోట్ల కార్యాలయాలు నిర్మించారు. ఆయా కార్యాలయాలను డిస్ట్రిబ్యూటరీ కమిటీలకు అప్పగించాల్సి ఉంది. అయితే ఈ విషయాన్ని నెలలు గుడుస్తున్నా అధికారులు పట్టించుకోలేదు.

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

◆ నీటి సంఘం సమావేశం నిర్వహిద్దామని ఓ డీసీ అధ్యక్షుడు ఓ అధికారిని కోరగా.. మొబైల్ ద్వారా మాట్లాడుతున్నారుగా. ఇక ప్రత్యేకంగా సమావేశంతో పనేముందని సమాధానం.

◆ సమావేశం గురించి మాట్లాడేందుకు ఓ నీటి సంఘం అధ్యక్షుడు ఓ అధికారికి ఫోన్ చేయగా.. బిజీగా ఉన్నాను.. తర్వాత మాట్లాడతాను.. అని సమాధానమిచ్చి ఇంతవరకు స్పందించలేదు.

◆ నీటి సంఘాల బాధ్యతలను చూసే ఓ అధికారిని సమావేశం గురించి ప్రశ్నిస్తే చూద్దాం లేండి.. అని సమాధానం.

..ఇదీ గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల పరిధిలోని నీటి సంఘాల అధ్యక్షులతో అధికారులు వ్యవహరిస్తున్న తీరు. అధికారుల సమాధానాలతో నీటి సంఘాల అధ్యక్షులు కంగుతింటున్నారు. అధికారుల తీరుతో నీటి సంఘాల బాధ్యులు ఆందోళన చెందుతున్నారు. అసలు తాము నీటి సంఘాల అధ్యక్షులమా కాదా.. తమకు అధికారాలు ఉన్నాయా లేవా.. అని అయోమయంలో ఉన్నారు. ఓ పథకం ప్రకారం నీటి సంఘాలను నిర్వీర్యం చేసే ప్రయత్నాలు జరుగుతున్నాయన్న ఆందోళన ఎన్నికైన వారిలో వ్యక్తమవుతోంది. అధ్యక్షుల పరిస్థితి ఉత్సవ విగ్రహాల చందాన ఉందన్న ఆరోపణలు ఉన్నాయి.

ప్రభుత్వ లక్ష్యాల మేరకు కాల్వల నిర్వహణలో, నీటి పంపిణీలో భాగస్వాములను చేయాలని సంఘాల అధ్యక్షులు కోరుతున్నారు. సకాలంలో వర్షాలు కురిసి ప్రాజెక్టుకు నీరు వస్తే జూలైలో నీటి సరఫరా చేసే అవకాశం ఉంటుంది. ఈ లోగా కాల్వల మరమ్మతులు పూర్తి చేయాల్సి ఉంది. ఏ కాల్వలో.. ఏ పనులు చేయాలనే విషయంలో సంఘాలకు పూర్తి అవగాహన ఉంటుంది. రైతుల ద్వారా సమస్యలు తెలుసుకుని పనులు చేపడితే సాగుదారులకు నీటి ఇబ్బందులు ఉండవు. అయితే ఈ దిశగా జలవనరుల శాఖ స్పందించడంలేదు. కనీసం నీటి సంఘాలతో సమావేశాలు నిర్వహించేందుకు కూడా సదరు అధికారులు ఇష్టపడటం లేదని పలువురు అధ్యక్షులు వాపోతున్నారు. నీటి సంఘాలను నిర్వీర్యం చేసేలా అధికార యంత్రాంగం వ్యవహరిస్తోందన్న విమర్శిస్తున్నారు.

ప్రభుత్వ లక్ష్యానికి విరుద్ధంగా అధికారులు

సాగునీటి వ్యవస్థను బలోపేతం చేసేందుకు కూటమి ప్రభుత్వం ఐదు నెలల క్రితం నీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహించింది. కాల్వల నిర్వహణ.. సాగునీటి పంపిణీలో సంఘాలను భాగస్వాములను చేయాలని ప్రభుత్వం సంకల్పించింది. రైతులకు దగ్గరగా ఉంటూ సాగు నీటి సమస్యలు తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేయడంతో పాటు కాల్వల మరమ్మతులు, చివరి భూమి వరకు సాగునీటిని అందించడంలో కీలక పాత్ర పోషించాలని ప్రభుత్వం సంఘాలకు సూచించింది. ఇది నిజమే కదా అని ఆయా పనులు చక్కపెట్టేందుకు ప్రయత్నిస్తున్న సాగునీటి సంఘాలకు జలవనరుల శాఖ అధికారుల నుంచి అవమానాలే ఎదురవుతున్నాయని కొందరు అధ్యక్షులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాల్వల నిర్వహణ పనులను గుర్తించడం, నీటి తీరువా వసూళ్లలో నీటి సంఘాలను భాగస్వాములను చేయాలని ప్రభుత్వం సూచిస్తోంది. అయితే ప్రభుత్వ లక్ష్యాలను జలవనరుల శాఖ తుంగలో తొక్కుతుందన్న విమర్శలున్నాయి.

ఆ లేవుట్లను ఏమిచేద్దాం?



చీరాల : దేవాంగపురి పంచాయతీలో నిబంధనలకు విరుద్ధంగా వేసిన లే అవుట్ (పాత చిత్రం)

- జిల్లాలో 285 అక్రమ లే అవుట్లు గుర్తింపు
- వాటిపై చర్యల విషయంలో ఇప్పటికీ లేని స్పష్టత
- త్వరలో మరోసారి సమావేశం కానున్న అధికారులు

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

అక్రమ లేఅవుట్లను గుర్తించారు.. నోటీసులు ఇచ్చారు.. అయితే ఇదంతా జరిగి ఎనిమిది నెలలు అవుతున్నా ఇంకా వాటిని ఏమి చేయాలనే విషయంపై అధికారులు ఎటూ తేల్చలేకపోతున్నారు. వైసీపీ హయాంలో, అంతకుముందు వేసిన అనధికారిక లే అవుట్లపై కూటమి ప్రభుత్వం దృష్టి సారించింది. రేపల్లె, బాపట్ల, చీరాల మున్సిపాలిటీలతో పాటు బాపట్ల, ఒంగోలు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీలో భాగమై ఉన్న అక్రమ లే అవుట్ల వివరాలను సేకరించింది. ప్రభుత్వం ప్రకటించిన జాబితాలో ఉన్న లే అవుట్లలో ఎటువంటి క్రయ విక్రయాలు జరపడానికి వీల్లేదని కూడా తెలిపింది. త్వరలోనే వాటి క్రమబద్ధీకరణకు మార్గదర్శకాలు జారీ చేస్తామని ప్రభుత్వం చెప్పింది. అది మొదలు ఇప్పటి వరకు అక్రమ లే అవుట్లపై చర్యల విషయంలో ఎటువంటి కదలిక లేదు. మరో వైపు ప్రభుత్వం ప్రకటించిన అక్రమ లే అవుట్ల జాబితాలో ఉన్న ప్లాట్లలో దాదాపు 80 శాతం అమ్మకాలు జరిగిపోయాయి. వాటిని కొనుక్కున్న వారు లబోదిబో మంటున్నారు. ఎనిమిది నెలల వ్యవధిలో మూడు సార్లు అక్రమ లే అవుట్లపై సమీక్ష జరిపిన అధికారులు ఎటువంటి నిర్ణయానికి రాలేకపోయారు. ఇటీవల బావుడాకు అధికారాలు కట్టబెడుతూ ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడంతో ఈ అంశం మరోమారు తెరపైకి వచ్చింది. నిబంధనలకు విరుద్ధంగా వేసిన లే అవుట్లపై ఎలాంటి వైఖరి అవలంబించాలనే విషయంపై తాజాగా కలెక్టర్ అధ్యక్షతన సమావేశం జరిగింది. అయితే ఇక్కడ కూడా ఏదీ తేల్చకుండానే ముగిసింది. వాటిపై చర్యల విషయంలో రాష్ట్రస్థాయిలోని మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీకి రిఫర్ చేశామని యంత్రాంగం చెబుతోంది. త్వరలోనే మరోమారు సమావేశమై అనధికారికంగా వేసిన లే అవుట్లపై చర్యల విషయంలో ఓ నిర్ణయానికి వస్తామని అధికారులు చెబుతున్నారు. ఈ పరిస్థితుల్లో అటు ప్లాట్లు కొనుక్కున్న వినియోగదారుల్లో కానీ, లేక జరిమానాలు కట్టి క్రమబద్ధీకరణ చేయించుకోవడానికి సిద్ధంగా ఉన్న రియల్టర్లు కానీ ప్రస్తుతం త్రిశంకు స్వర్గంలో ఉన్నారు.

ఇబ్బడిముబ్బడిగా..

గత ప్రభుత్వంలో ఎటువంటి అనుమతులు లేకుండా రాజకీయ అండదండలతో ఇష్టారాజ్యంగా లే అవుట్లు వేశారు. అధికారులు నోటీసులు జారీ చేయడం వాటిని పట్టించుకోకపోవడం ఓ ప్రహసనంలా నడిచింది. బాపట్ల అర్బన్ డెవలప్‌మెంట్ పరిధిలో ఉన్న రేపల్లె, బాపట్ల నియోజకవర్గాల పరిధిలో 104 అక్రమ లే అవుట్ల వివరాలను గతేడాది ఆగస్టులోనే ప్రభుత్వం వెల్లడించింది. బాపట్ల మున్సిపాలిటీ పరిధిలో 39, రేపల్లెలో 40, ఒంగోలు అర్బన్ డెవలప్‌మెంట్ పరిధిలో 102 అనధికారిక లే అవుట్లను ప్రభుత్వం గుర్తించి జాబితా విడుదల చేసింది. వీటిలో 80 శాతం అమ్మకాలు జరిగి ఉండడం వల్ల యజమానులకు ఇబ్బంది లేకుండా జరిమానాలు విధిస్తామని ప్రభుత్వం తెలిపింది. కానీ అమ్ముడయిన వాటి విషయంలో యజమానులు ఎందుకు స్పందిస్తారనే దానికి ప్రభుత్వం వైపు నుంచి సమాధానం కొరవడింది. పైగా క్రయవిక్రయాలు నిషేధమని ప్రకటించినప్పటికీ ఈ ఎనిమిది నెలల కాలంలో యథేచ్ఛగా రిజిస్ట్రేషన్లు జరుగుతూనే ఉన్నాయి. ఇదే విషయంపై సదరు విభాగం వివరణ కోరగా తమకు ఉన్నతాధికారుల నుంచి ఎటువంటి ఆదేశాలు రాలేదని చెప్పడం గమనార్హం. జాబితా ప్రకటించిన దగ్గర నుంచి ఇప్పటి వరకు దాదాపు 430 వరకు ప్లాట్ల రిజిస్ట్రేషన్లు జరిగినట్లు తెలుస్తోంది.

సాల్ట్ భూములకు.. ధర నిర్ణయించాలి

- పరిశీలనకు జిల్లా స్థాయి కమిటీ ఏర్పాటు
- అధికారులను ఆదేశించిన కలెక్టర్ జె.వెంకటమురళి

బాపట్ల, మే 6 (ఆంధ్రజ్యోతి): సాల్ట్ భూములను పరిశీలించి వాటికి మార్కెట్ ధరలను నిర్ణయించాలని కలెక్టర్ జె.వెంకటమురళి తెలిపారు. సాల్ట్‌భూముల పరిశీలన, ధరల నిర్ధారణపై అధికారులతో మంగళవారం కలెక్టర్ ఛాంబర్‌లో సమావేశం నిర్వహించారు. సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ పరిశీలనకు జిల్లా స్థాయి కమిటీని ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. చిన్నగంజాం మండలంలో 2,486 ఎకరాల భూములు సాల్ట్‌కమిషన్ ఆధీనంలో ఉన్నాయన్నారు. ప్రభుత్వం ఆదేశాల మేరకు ఆభూములను సర్వే చేయాలన్నారు. భూమి ప్రస్తుత పరిస్థితిపై సమగ్రనివేదిక రూపొందించాలని ఆదేశించారు. సమావేశంలో డీఆర్వో జి.గంగాధర్‌గౌడ్, చీరాల ఆర్డీవో చంద్రశేఖర్, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ అధికారులు పాల్గొన్నారు.

● ప్రజాసమస్యల పరిష్కారవేదిక ద్వారా నేరుగా ముఖ్యమంత్రి కార్యాలయంలో ఫిర్యాదు చేసుకునే అవకాశాన్ని రాష్ట్రప్రభుత్వం కల్పించిందని కలెక్టర్ జె.వెంకటమురళి తెలిపారు. సమాజంలో నిరాధరణకు గురయ్యే గిరిజన, దివ్యాంగుల కోసం ప్రతినెలలో నాలుగో శుక్రవారం ప్రత్యేక గ్రీవెన్స్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వినతిపత్రాల ద్వారా వారి సమస్యలను తన దృష్టికి తీసుకురావచ్చని చెప్పారు. ప్రజలు సమస్యలను నేరుగా ముఖ్యమంత్రి కార్యాలయంలో ఫిర్యాదు చేయడానికి కాల్‌సెంటర్ 1100ను వినియోగించుకోవాలన్నారు. ప్రజలు చేసే ప్రతి ఫిర్యాదును తక్షణమే రిజిస్ట్రేషన్ చేసి రశీదు అందజేస్తామన్నారు. సమస్య పరిష్కారమవ్వగానే ఫిర్యాదు దారుడికి ధ్రువీకరణపత్రం అందజేస్తామని తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ జె.వెంకటమురళి


● మనమిత్ర పేరుతో రాష్ట్రప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా వాట్సాప్ గవర్నెన్స్‌ను ఏర్పాటు చేసిందని కలెక్టర్ తెలిపారు. వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా సుమారు 200 ప్రభుత్వ సేవలను ప్రజలకు అందిస్తున్నామన్నారు. ప్రజలు మొబైల్ నుంచి 9195523000009కు హాయ్ అని మెసేజ్ పంపి సేవలను పొందవచ్చన్నారు.

డిపాజిట్ల పేరుతో బురిడీ

- పరారీలో సొసైటీ నిర్వాహకుడు
- మహిళ ఫిర్యాదుతో కేసు నమోదు

వేమూరు, మే 6 (ఆంధ్రజ్యోతి): ఫిక్స్‌డ్ డిపాజిట్లు.. నెలవారీ స్కీమ్‌లు .. రికరింగ్ డిపాజిట్లు.. బంగారం తాకట్టుపై రుణాలు.. అంటూ బురిటీ కొట్టి రూ.3 కోట్లతో ఎగనామం పెట్టి పారిపోయిన ఓ సొసైటీ నిర్వాహకుడి ఉదంతమిది. మండలంలోని చావలి గ్రామంలో మణికంఠ మ్యూచువల్లీ ఎయిడెడ్ కో-ఆపరేటివ్ సొసైటీని ఎనిమిదేళ్ల క్రితం ప్రారంభించిన తెనాలికి చెందిన కొల్లూరు ఉదయవెంకటేశ్వరరావుపై కేసు నమోదు చేసినట్లు వేమూరు ఎస్ఐ రవికృష్ణ తెలిపారు. గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులు సొసైటీలో సభ్యులుగా చేరి ఆయా స్కీముల్లో చేరి పెద్దమొత్తంలో నగదు కడుతున్నారు. కాగా గత నెల 30న సొసైటీ కార్యాలయానికి తాళాలు వేసి వెంకటేశ్వరరావు పరారీలో ఉన్నాడు. దీంతో దేవరకొండ కోటేశ్వరమ్మ అనే బాధితురాలు మంగళవారం వేమూరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు. 32 గ్రాముల బంగారం వస్తువులను సొసైటీలో తాకట్టు పెట్టి రుణం తీసుకున్నానని తిరిగి వాటిని విడిపించేందుకు సొసైటీకి వెళ్లగా వెంకటేశ్వరరావు పరారీలో ఉన్నట్లు తెలిసిందని తనకు న్యాయం చేయాలని ఆమె ఫిర్యాదులో కోరారు. సంబంధిత సొసైటీలో గ్రామానికి చెందిన 100 మందికి పైగా సభ్యులు చీటీ డబ్బులు కడుతున్నారని, దాదాపు రూ.3 కోట్ల దాకా చెల్లించి ఉంటారని గ్రామస్తులు చెబుతున్నారు. బాధితులు ఎవరికి వారు మోసపోయామంటూ రోధిస్తున్నారు.

తెలుగు మీడియం లేకపోవడం దారుణం



సమావేశంలో మాట్లాడుతున్న యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేశ్వర్లు

బాపట్ల, మే 6 (ఆంధ్రజ్యోతి): తెలుగురాష్ట్రాలలో తెలుగుమీడియం లేకపోవడం దారుణమని యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.వెంకటేశ్వర్లు తెలిపారు. బాపట్ల మున్సిపల్ హైస్కూల్‌లో మంగళవారం యూటీఎఫ్ కార్యకర్తల జిల్లా స్థాయి శిక్షణా తరగతుల్లో ఆయన ప్రసంగించారు. మొదటి భాషాప్రయుక్త రాష్ట్రం, ప్రాచీన భాషగా తెలుగు విరాజిల్లిన ప్రాంతంలోని పాఠశాలల్లో తెలుగుభాష నేర్చుకునే పరిస్థితి లేకపోవడం ఆక్షేపణీయమని ఆవేదన వ్యక్తం చేశారు. ఏ మీడియం చదువుకోవాలో స్వేచ్ఛ పిల్లలకు ఉండేలా చూడాలన్నారు. పదో తరగతి పరీక్షలలో సుమారు 60 వేల మంది విద్యార్థులు తెలుగుమీడియంలో మాత్రమే పరీక్ష రాశారనే విషయాన్ని ప్రభుత్వం, విద్యాశాఖాధికారులు గుర్తించాలన్నారు. జీవో 117 రద్దు అంటే దానికి ముందు ఉన్న విద్యావిధానం అమలు చేయాల్సి ఉండగా జీవో 117కు మార్పులు మాత్రమే చేస్తున్నట్లు ఉందన్నారు. సమాంతర మీడియం కొనసాగించాలని, హైస్కూల్‌లో 1:45 ఆధారంగా సెక్షన్ ఉండాలన్నారు. మోడల్ ప్రైమరీ పాఠశాలలను స్వాగతిస్తూనే మిగిలిన ప్రాథమిక పాఠశాలలను యథాతథంగా కొనసాగించాలని యూటీఎఫ్ డిమాండ్ చేయగా దానికి భిన్నంగా విద్యాశాఖ కసరత్తు చేస్తుందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు కె.శ్రీనివాసరావు, రాష్ట్ర కార్యదర్శి ఎన్.నవకోటేశ్వరరావు, రాష్ట్ర ప్రచురణ విభాగం ఛైర్మన్ ఎం.హనుమంతరావు, జిల్లా అధ్యక్ష,కార్యదర్శులు జె.వినయ్‌కుమార్, ఎ.శ్రీనివాసరావు, పాపారావు, బిక్షాలుబాబు, వెంకటేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అర్ధరాత్రి హైవేలో.. హల్‌చల్

- ఇద్దరిపై విచక్షణా రహితంగా దాడి
- ఈపూరుపాలెం పోలీసుల అదుపులో ముగ్గురు

ఈపూరుపాలెం(చీరాల), మే 6 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారి 216పై సోమవారం అర్ధరాత్రి పక్క నియోజకవర్గంలో పోలీసుశాఖలో పనిచేస్తు న్న ఓ ఉద్యోగి కుమారుడు, మరో నలుగురు యువకులతో కలిసి హల్‌చల్ చేశాడు. కర్రలు, రాడ్లుతో విచక్షణ రహితంగా దాడి చేశారు. ఆ సమయంలో అటుగా వెళ్తున్న ఓ మాజీ ప్రజాప్రతినిధి చొరవతో బాధితులను రక్షించి. దాడికి పాల్పడిన వారిలో ముగ్గుర్ని ఈపూరుపాలెం స్టేషన్‌కు తరలించారు. ఈ ఘటనకు సంబంధించిన వివరాలు.. పాపాయిపాలేనికి చెందిన ఓ వ్యక్తి, కీర్తివారిపాలేనికి చెందిన ఓ బంధువుతో కలిసి సోమవారం రేపల్లెలోని ఓ శుభకార్యానికి వెళ్లి తిరిగి వస్తూ బాపట్ల మండలం వెదుళ్లపల్లి సమీపంలోని ఓ దాబా వద్ద ఆగారు. ఆ సమయంలో ఓ పోలీసు ఉద్యోగి కుమారుడు, కొందరు యువకులు అక్కడ పుట్టిన రోజు వేడుక చేసుకుంటున్నారు. అయితే వారిద్దరూ తమను కామెంట్ చేశారని భావించిన యువకులు కారులో బైక్‌పై వెళ్తున్న వారిని వెంబడించారు. ఈపూరు పాలెం మలుపు కాల్వ వద్ద బైక్‌పై ఉన్న వారిని అడ్డగించి పొలాల్లోకి లాక్కుని వెళ్లి రాడ్లు, కర్రలతో దాడి చేశారు. ప్రాణాలు కాపాడుకునే క్రమంలో ఆ ఇద్దరు పరిగెత్తుతూ రోడ్డుపైకి వచ్చారు. ఆ సమయంలో వేటపాలెం వైపు కారులో వెళుతున్న మాజీ ప్రజాప్రతినిధిని, బాపట్ల మండలం కంకటపాలెం నుంచి వస్తున్న ట్రాక్టర్‌ను ఆపి సహాయం కోసం అర్థించారు. దీంతో దాడికి పాల్పడిన వారి లో ముగ్గుర్ని ట్రాక్టర్‌లోని వారు, మాజీ ప్రజా ప్రతినిధి పట్టుకోగా మరో ఇద్దరు పరా రయ్యారు. ఆ ముగ్గుర్ని ఈపూరుపాలెం పోలీసులకు అప్ప గించారు. ఈ ఘటనపై పోలీసులు రహస్యంగా దర్యాప్తు చేస్తున్నారని సమాచారం. నిందితుల కుటుంబ సభ్యులు మధ్యవర్తుల ద్వారా రాజీ ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలిసింది.

కేంద్రసాహిత్య అకాడమి అవార్డు గ్రహీత

పెనుగొండకు ఘన సన్మానం

వినుకొండ, మే 6 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని జాషువా కళా ప్రాంగణంలో సోమవారం రాత్రి కేంద్ర సాహిత్య అకాడమి అవార్డు గ్రహీత, అరసం జాతీయ అధ్యక్షుడు పెనుగొండ లక్ష్మీనారాయణను ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు ఘనంగా సన్మానించారు. ముందుగా వినుకొండ పట్టణంలోని పలువురు కళాకారులు ఆయనను ఘనంగా ఊరేగించారు. అనంతరం శివయ్య, గంగినేని, జాషువా విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. జాషువా కళాప్రాంగణంలో అభి



పెనుగొండ లక్ష్మీనారాయణ దంపతులను సన్మానిస్తున్న చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు

నందన సభ ఏర్పాటు చేశారు. జీవీ ఆంజనేయులు పాల్గొని, మాట్లాడుతూ కేంద్ర సాహిత్య అకాడమి అవార్డు అందుకున్న పెనుగొండను రాష్ట్ర ప్రభుత్వం తగిన రీతిలో గౌరవించేందుకు తాను చొరవ తీసుకుంటానని తెలిపారు. పెనుగొండ మాట్లాడుతూ నాడు చెప్పులు లేకుండా తాను నడిచిన పుర వీధుల్లో నేడు కారులో ఊరేగించడం ఆనందంగా ఉందన్నారు. అందుకే తాను వినుకొండను మరువనని, తనను వినుకొండ మరువదని పేర్కొన్నారు. అభ్యుదయ కవి పులుపుల శివయ్య చిన్నవయసులో వేలుపట్టి బిడ్డగా నడిపించారని అందుకే ఆయన పేరుతో ఏటా సాహితీవేత్తలకు పురస్కారాలు అందిస్తున్నట్లు ఆయన తెలిపారు. అరసం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వల్లూరి శివప్రసాద్, సీనియర్ న్యాయవాది చెరుకూరి సత్యనారాయణ, వెటర్నరీ కౌన్సిల్ ఛైర్మన్ డాక్టర్ పారా లక్ష్మయ్య, సీహెచ్‌ఎల్ఎన్ మూర్తి, పి.జె.లూకా, సీపీఐ నేతలు మారుతి వర ప్రసాదరావు, బొంకూరి వెంకటేశ్వర్లు, రోటరీ క్లబ్ అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి, కౌన్సిలర్ షేక్ షకీలా, గీతాంజలి విద్యాసంస్థల ఛైర్మన్ ఎండ్లూరి శేషగిరిరావు, వినుకొండ బార్ అసోసి యేషన్ అధ్యక్షుడు మీసాల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

గృహ నిర్మాణ సామగ్రి పక్కదారి.. విశ్రాంత ఏఈ అరెస్టు

పెదకూరపాడు, మే 6 (ఆంధ్రజ్యోతి): పెదకూరపాడు గృహ నిర్మాణ శాఖ ఏఈగా పనిచేస్తున్న సమయంలో రూ.47 లక్షల విలువైన ఇనుము, సిమెంట్ లెక్క అప్పగించని షేక్ పాషాను మంగళవారం పెదకూరపాడు పోలీసులు అరెస్టు చేశారు. గృహ నిర్మాణ శాఖ డీఈ సూర్య భగవాన్ గతేడాది జూన్ 23న 97 టన్నుల గృహ నిర్మాణానికి అవసరమైన ఇనుము, 230 బస్తాల సిమెంట్‌ను ఏఈ పాషా పక్కదారి పట్టించారని ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వైసీహెచ్ అల్లూరిరెడ్డి తెలిపారు. మంగళవారం ఆయనను గుంటూరులో అరెస్టు చేశామని వివరించారు. గృహ లబ్ధిదారుల్లో ఒకే వ్యక్తికి ఇనుము రెండుమూడు సార్లు ఇచ్చినట్లు రికార్డుల్లో ఏఈ నమోదు చేశారని తెలిపారు. గృహ నిర్మాణశాఖ అధికారుల విచారణలో రెండుమూడు సార్లు తాము ఇనుము తీసుకోలేదని లబ్ధిదారులు చెప్పారు. అప్పటి నుంచి ఈ విశ్రాంత ఏఈ పరారీలో ఉన్నారని ఎస్ఐ తెలిపారు.

ప్రేమజంట ఆత్మహత్యాయత్నం

● ప్రియుడు మృతి.. ప్రియురాలు క్షేమం ● యడ్లపాడు మండలం కొండవీడులో ఘటన ● కొడుకు మృతిపై తండ్రి అనుమానం

యడ్లపాడు, మే 6 (ఆంధ్రజ్యోతి): పల్నాడు జిల్లా యడ్లపాడు మండలం కొండవీడు రెవెన్యూ పరిధిలో ప్రేమ జంట ఆత్మహత్యకు పాల్పడిన ఘటన కలకలం రేపింది. ఈ ఘటనలో ప్రేమికుడు మృతిచెందగా.. తీవ్రగాయాలతో ఉన్న ప్రియురాలిని యువకుడి స్నేహితులు రక్షించారు. అయితే మృతుడి తండ్రి మాత్రం ఈ వ్యవహారంపై అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఈ ఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గుంటూరు రూరల్ మండలం దాసరిపాలెం గ్రామానికి చెందిన కొర్నెపాటి మహేష్, కవిత కుమారుడు తేజ(19) చౌడవరంలోని ఓ ప్రైవేటు ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. పార్వతీపురం మన్యం జిల్లా కొమరాడ మండలం పరశురామాపురం గ్రామానికి చెందిన ఓ కుటుంబం దాసరిపాలెం పరిధిలోని ఒక నూలు మిల్లులో పనిచేస్తూ.. గ్రామంలోనే నివాసం ఉంటోంది. సదరు కుటుంబానికి చెందిన యువతి కీర్తన అలియాస్ సమీరా, తేజ మూడేళ్లుగా ప్రేమించుకుంటున్నారు. వీరి ప్రేమను ఇరు కుటుంబాల పెద్దలు అంగీకరించలేదు. తేజ సోమవారం రాత్రి స్నేహితులు చందు, కోటితో కలసి కారులో బయటకు వెళ్లాడు. వారితో పాటు తెల్లవారు జామున కీర్తనతో కలసి కొండవీడు రెవెన్యూ పరిధిలో (చౌడవరం బాలకుటీర్ వెనుకనున్న)ని క్వారీ గుంత వద్దకు వెళ్లాడు. గుంత ఒడ్డున గల 50 అడుగుల కొండ పైకి చేరుకుని అక్కడి నుంచి ప్రేమి కులిద్దరూ క్వారీలోకి దూకారు. ఈ ఘటనలో తేజ నీటిలో మునిగిపోయి మృతిచెందగా.. కీర్తనను అక్కడికి చేరుకున్న స్నేహితులు రక్షించారు. గాయపడిన కీర్తనను గుంటూరు జీజీహెచ్‌కు చికిత్స నిమిత్తం తరలించారు. తేజ స్నేహితులు కోటి, చందు వీరిని క్వారీకుంట వద్ద వదలి వెళ్లారని, కొద్దిసేపటికి తేజ, కీర్తనల నుంచి ఫోన్ రావడంతో ఇద్దరూ తిరిగి క్వారీ గుంత వద్దకు వెళ్లగా.. కేకలు వేస్తూ ఉన్న కీర్తనను కాపాడారని పోలీసులు తెలిపారు. పెద్దలు వీరి ప్రేమను కాదనడంతో ఆత్మహత్యకు పాల్పడినట్లు కథనాలు ఒక వైపు వస్తున్నప్పటికీ.. తేజ తండ్రి మహేష్, స్థానికులు మాత్రం అది ఆత్మహత్య కాదని అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఇదే విషయాన్ని పోలీసుల దృష్టికి మహేష్ తీసుకెళ్లారు. పోలీసులు చందు, కోటిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. చిలకలూరిపేట రూరల్ సీఐ సుబ్బనాయుడు, యడ్లపాడు ఎస్ఐ శివరామకృష్ణ నేతృత్వంలో క్వారీ కుంటలోని నీళ్లను సాయంత్రానికి పూర్తిగా తోడించడంతో తేజ మృతదేహం బయటపడింది. పెద్దలు తమ ప్రేమను నిరాకరించినందు వల్లనే ప్రేమికులిద్దరూ ఆత్మహత్యకు పాల్పడ్డారా.. లేక ఇతర కారణాలు ఏమైనా ఉన్నాయా అనే కోణంలో పోలీసులు విచారిస్తున్నారు.



కొర్నెపాటి తేజ (ఫైల్)



ప్రేమజంట ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన క్వారీ గుంత

గ్రంథాలయాల అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం

● గ్రంథాలయ పరిషత్ రాష్ట్ర చైర్మన్ గోనుగుంట్ల

గుంటూరు(తూర్పు), మే 6(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో నిరాదరణకు గురవుతున్న గ్రంథాలయాల అభివృద్ధికి, మాతృ భాషా వికాసానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు వెల్లడించారు. రాష్ట్ర గ్రంథాలయ పునర్వికాస ఉద్యమ వేదిక ప్రతినిధులు మంగళవారం స్థానిక బృందావన్ గార్డెన్స్‌లోని ఆయన కార్యాలయంలో కలసి వినతి పత్రం అందజేశారు. ఇటీవల రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించిన కార్యక్రమాల్ని, రాష్ట్ర సదస్సు చేసిన తీర్మానాలను వేదిక కన్వీనర్ వల్లూరు శివప్రసాద్ ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. ఈ సందర్భంగా గోనుగుంట్ల మాట్లాడుతూ గ్రంథాలయాల్లో నూతన పుస్తకాలు కొనుగోలు, ఉద్యోగాల భర్తీ, విద్యా సంస్థల్లో గ్రంథాలయాల అభివృద్ధిపై కసరత్తు చేస్తున్నామని, సంబంధిత అధికారులతో చర్చించి త్వరలోనే సమస్యల్ని పరిష్కరిస్తామని స్పష్టం చేశారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో చలపాక ప్రకాష్, పరుచూరి అజయ్ కుమార్, సీహెచ్ సుశీల, మోతుకూరి అరుణకుమార్, నానా, శ్రీవశిష్ట, ఎస్ఎం సుభాని ఉన్నారు.



కోటేశ్వరరావుకు వినతిపత్రం అందజేస్తున్న వేదిక ప్రతినిధులు

రేషన్ షాపుల్లో విజిలెన్స్ తనిఖీలు



దమ్మాలపాడు రేషన్ షాపులో తనిఖీ చేస్తున్న విజిలెన్స్ సీఐ శివాజీ

గుంటూరు సిటీ, మే 6 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి గుంటూరు జిల్లాలోని రేషన్ షాపుల్లో విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు మంగళవారం తనిఖీలు నిర్వహించారు. పల్నాడు జిల్లా ముప్పాళ్ల మండలంలోని బొల్లవరం, దమ్మాలపాడు గ్రామాల్లోని రేషన్ షాపుల్లో స్టాక్‌ను పరిశీలించారు. సత్తెనపల్లిలోని మండల స్థాయి స్టాక్ పాయింట్‌లో రికార్డులు తనిఖీ చేశారు. విజిలెన్స్ సీఐ పల్లపు శివాజీ మాట్లా డుతూ రేషన్ సరుకులను సరిగా ప్రజలకు పంపిణీ చేయాలని, అవకతవకలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని డీలర్లను హెచ్చరించారు. రెవెన్యూ అధికారులు, విజిలెన్స్ సిబ్బంది పాల్గొన్నారు.

ఏపీ సీపీడీసీఎల్ టెక్నికల్ డైరక్టర్‌గా మురళీకృష్ణయాదవ్



గుంటూరు, మే 6(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ సెంట్రల్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కార్పొరేషన్ లిమిటెడ్ టెక్నికల్ డైరక్టర్‌గా ఆవుల మురళీకృష్ణ యాదవ్ నియమితులయ్యారు. ఈ మేరకు ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. విద్యుత్ శాఖలో ఉమ్మడి గుంటూరు జిల్లాలో సుపరిచితులైన ఆయన ఏఈ స్థాయి నుంచి ప్రస్థానం ప్రారంభించారు. తెనాలి డివిజన్ ఆపరేషన్ డీఈగా పనిచేశారు. 2022 నుంచి ఉమ్మడి గుంటూరు జిల్లా సర్కిల్ ఆపరేషన్స్ ఎస్ఈగా రెండేళ్లకు పైగా కొనసాగారు. అనంతరం ఉద్యోగోన్నతిపై విజయవాడ కార్పొరేట్ కార్యాలయంలో సీజీఎంగా పనిచేసి ఉద్యోగ విరమణ చేశారు. ఆయన సేవలను, సమర్థతను గుర్తించిన ప్రభుత్వం తాజాగా సీపీడీసీఎల్ టెక్నికల్ డైరక్టర్‌గా నియమిస్తూ ఆదేశాలు జారీ చేసింది. రెండేళ్ల పాటు ఆయన ఈ పదవిలో కొనసాగనున్నారు. విజయవాడలోని కార్యాలయంలో బుధవారం బాధ్యతలు స్వీకరించనున్నారు. ఈ మేరకు గుంటూరు టౌన్-1 ఆపరేషన్ ఈఈ తిరుమలశెట్టి శ్రీనివాసబాబు, పలువురు అధికారులు, ఉద్యోగ సంఘాల నాయకులు మురళీకృష్ణకు అభినందనలు తెలియజేశారు.

అటవీ సంపదను అమ్మేస్తున్నారు..

● అటవీశాఖ అధికారులు మామూళ్లు తీసుకుంటున్నారు

పిడుగురాళ్ల, మే 6 (ఆంధ్రజ్యోతి): అవి పులిచింతల ప్రాజెక్టు ముంపు ప్రాంతాలు. అక్కడే విస్తారమైన.. అటవీ సంపదపై కొందరి కన్ను పడింది. పగలు, రాత్రి అనే తేడాలేకుండా చెట్లను నరికి సొమ్ము చేసుకుంటున్నారు. మాచవరం, బెల్లంకొండ మండలాల సరిహద్దుల్లో ఈ దందా యథేచ్ఛగా సాగుతోంది. ఇక్కడి ఎమ్మాజిగూడెం అటవీ ప్రాంతంలో చెట్లను యంత్రాల సాయంతో నరికి, దుంగలను ఎమ్మాజిగూడెం, శ్రీరుక్మిణీపురం, పిల్లుట్ల మీదుగా పిడుగురాళ్ల బైపాస్‌కు చేరుకొని.. అక్కడి నుండి గుంటూరు, జానపాడు రోడ్డులో ఉన్న ఓ మిల్లుకు తరలిస్తున్నారు. మరి కొన్ని పీఓపీ తయారీ కంపెనీ లకు కూడా అటవీ సంపదను విక్రయించి, జేబులు నింపుకుంటున్నారు. అక్రమార్కులకు కొందరు అట వీశాఖ అధికారులు సహకరిస్తున్నారు. ఒక్కో ట్రక్కుకు వెయ్యి రూపాయలు చొప్పున మామూళ్లు తీసుకుంటున్నారు. రోజుకు 5 ట్రక్కుల కలపను తరలిస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి.



ట్రాక్టర్లలో తరలిస్తున్న అటవీ సంపద

ఎస్సీ క్రైస్తవులను ఎస్సీ హిందువులుగా నమోదు చేసిన జగన్ సర్కార్

పొన్నూరుటౌన్, మే 6 (ఆంధ్రజ్యోతి) : షెడ్యూల్ కులాల నుంచి మారిన క్రైస్తవులను, చాలా మంది పాస్టర్‌లను జగన్ ప్రభుత్వం ఎస్సీ హిందువులుగా నమోదు చేసిందని జీసెస్ బిలీవర్స్ అసోసియేషన్ కౌన్సిల్ చైర్మన్, ప్రొఫెసర్ జోసెఫ్ మోసగంటి మంగళవారం ఆరోపించారు. జగన్ ప్రభుత్వంలో సచివాలయ సిబ్బంది ఆన్‌లైన్ డేటా బేస్ నమోదు చేసిన సమయంలో ప్రజల వివరాలను అడగకుండానే కేవలం ఓటీపీ అడిగి సమాచారం నమోదు చేశారని ఆరోపించారు. ప్రజలు తాము పాస్టర్‌లమని, క్రైస్తవులమని చెప్పినప్పుడు క్రైస్తవ సర్టిఫికెట్ చూపించమని అడిగారన్నారు. కొంత మంది క్రైస్తవులుగా సర్టిఫికెట్‌లు చూపించినప్పటికీ హిందూ మతం నుంచి మారామని చెప్పినప్పుడు కూడా హిందువులుగా నమోదు చేశారని ఆరోపించారు. షెడ్యూల్ కులాల క్రైస్తవులు బీసీ-సీ కేటగిరీలోకి వెళ్లిపోతారని అన్నారు. వారిని కూడా ఎస్సీ హిందువుల కేటగిరిగా చూపిస్తే కేంద్ర ప్రభుత్వ నిధులు వస్తాయని అలా చేశారని ఆరోపించారు. దీని మూలంగా జగన్ ప్రభుత్వం లాభపడింది కానీ, క్రైస్తవులు ఇరుక్కుపోయారన్నారు. జగన్ రెడ్డి క్రైస్తవ సమాజానికి మేలు చేయకపోగా ఘోరమైన అన్యాయం చేశారన్నారు. చర్చిలకు వెళ్లే పాస్టర్‌లు, షెడ్యూల్ కులాల వారు క్రైస్తవులుగా నమోదు చేయించుకోవాలంటే తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లి దరఖాస్తు చేసుకోవాలని జోసెఫ్ మోసిగంటి సూచించారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.00 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	147, 156, 167
చికెన్ విత్ స్కిన్(కిలో)	284.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	294.00

బాపట్ల వార్తలు

◆ బాపట్ల ◆ వేమూరు ◆ రేపల్లె

నేడు మంత్రి పార్థసారథి పర్యటన : కలెక్టర్

బాపట్ల, మే6 (ఆంధ్రజ్యోతి) : పిడుగుపాటుకు గురైన బాధిత కుటుంబాలను పరామర్శించేందుకు జిల్లా ఇన్‌చార్జి మంత్రి, రాష్ట్ర సమాచార, పౌరసంబంధాల, గృహనిర్మాణశాఖల మంత్రి కొలుసు పార్థసారథి బుధవారం జిల్లాలో పర్యటిస్తారని కలెక్టర్ జె.వెంకటమురళి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అకాల వర్షం, ఉరుములు, మెరుపులు, పిడుగులు పడి జిల్లాలో ఇద్దరు మృతి చెందారని వారి కుటుంబాలకు ప్రభుత్వం నష్టపరిహారం ప్రకటించిందన్నారు. చినగంజాం మండలం సోపిరాల గ్రామానికి చెందిన గడ్డం బ్రహ్మయ్య పిడుగుపాటుతో మృతి చెందటంతో ఆ కుటుంబాన్ని పరామర్శించి మంత్రి పరిహారం అందిస్తారన్నారు. అలాగే చీరాల మండలం కొత్తపాలెంలో పిడుగుపాటుతో గేదె మృతి చెందగా పశువును కోల్పోయిన కుటుంబాన్ని పరామర్శించి నష్టపరిహారం అందిస్తారని, బాధిత కుటుంబాలను ప్రభుత్వం తక్షణమే ఆదుకుంటున్నదని కలెక్టర్ తెలిపారు.

వైసీపీ హయాంలో నిర్లక్ష్యానికి గురైన యువత

● టీఎన్ఎస్ఎఫ్ బాపట్ల పార్లమెంట్ అధ్యక్షుడు శరత్ చంద్ర



సమావేశంలో మాట్లాడుతున్న మొవ్వా శరత్ చంద్ర

బాపట్ల, మే 6 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ హయాంలో యువతను పూర్తిగా నిర్లక్ష్యం చేశారని టీఎన్ఎస్ఎఫ్ బాపట్ల పార్లమెంట్ అధ్యక్షుడు మొవ్వా శరత్ చంద్ర అన్నారు. బాపట్లలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌లు రద్దు చేయటం, ఉద్యోగ నోటిఫికేషన్‌లు లేకపోవటం, కొత్తపరిశ్రమలు లేకపోవటం వంటి కారణాలతో యువత రోడ్డున పడ్డారన్నారు. అనేకమంది బెట్టింగ్, డ్రగ్స్ వంటి వాటికి అలవాటుపడి భవిష్యత్తును నాశనం చేసుకున్నారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత యువత సంక్షేమం కోసం 20 లక్షల ఉద్యోగాలు ఇవ్వటమే లక్ష్యంగా పని చేస్తుందన్నారు. గడిచిన 11 నెలల్లో 16,347 పోస్టులతో మెగా డీఎస్సీ, 6,100 కానిస్టేబుల్ ఉద్యోగాలు భర్తీ, 8.5 లక్షల కోట్ల పెట్టుబడులతో 5 లక్షల ఉద్యోగావకాశాలు కల్పించేలా ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ఆపరేషన్ ఈగల్ కార్యక్రమాన్ని చేపట్టి గంజాయి, డ్రగ్స్‌పై ఉక్కుపాదం మోపటం జరిగిందన్నారు. బెట్టింగ్, లోన్ యాప్‌ల జోలికి వెళ్ళవద్దని అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో టీఎన్ఎస్ఎఫ్ పార్లమెంటరి సెక్రటరి పరిశా గోపి, తెలుగు యువత ఆర్గనైజింగ్ సెక్రటరి దేవేందర్ బాలాజి, పత్రి సుధీర్ పాల్గొన్నారు.

రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలి

● ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బందెల నాసర్‌జీ

బాపట్ల, మే6 (ఆంధ్రజ్యోతి) : పెండింగ్‌లో ఉన్న ఫీజురీయింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేయాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బందెల నాసర్‌జీ డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా విద్యారంగంలో సమస్యలను పరిష్కరించాలని ఏఐఎస్ఎఫ్ గుంటూరు జిల్లా సమితి ఆధ్వర్యంలో మంగళవారం సమావేశం నిర్వహించారు. నాసర్‌జి మాట్లాడుతూ పీజీ కామన్ ఎంట్రన్స్ పరీక్షను రద్దు చేసి పాతపద్ధతిలో నిర్వహించాలన్నారు. పేద విద్యార్థులకు వైద్య విద్యను దూరం చేసే 107, 108 జీవోలను రద్దు చేయాలన్నారు. యువగళం పాదయాత్రలో నారా లోకేశ్ ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలన్నారు. జీవో నెంబరు 77ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు డి.దిలీప్, తోకల విజయ్, సోమినేని సందీప్, గణేష్ పాల్గొన్నారు.

కార్మికులకు చట్టాలపై అవగాహన ఉండాలి

● ప్యానల్ లాయర్ దగ్గుమల్లి కిరణ్‌కుమార్

బాపట్ల, మే 6 (ఆంధ్రజ్యోతి) : ఆర్టీసీ గ్యారేజీలోని కార్మికులు చట్టాలు గురించి అవగాహన కలిగియుండాలని మండల న్యాయ సేవాధికార సంస్థ ప్యానల్ లాయర్ దగ్గుమల్లి కిరణ్‌కుమార్ తెలిపారు. బాపట్ల ఆర్టీసి డిపో గ్యారేజిలో మంగళవారం న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. సదస్సుకు న్యాయవాది కిరణ్‌కుమార్ ముఖ్యఅతిథిగా పాల్గొని కార్మిక సంక్షేమ చట్టాలపై అవగాహన కల్పించారు. ఉద్యోగభద్రత, పిల్లలకు విద్య, ఆరోగ్యభద్రత తదితర అంశాలపై ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో డిపో మేనేజర్ శ్రీమన్నారాయణ మాట్లాడుతూ ఆధునీక ప్రపంచంలో చట్టాలు గురించి తెలుసుకొని వాటిలోని అంశాలను అవలంబించటం ద్వారా మెరుగైన సమాజంలోకి వెళ్ళవచ్చు అని తెలిపారు. కార్యక్రమంలో పారా లీగల్ వలంటీర్లు ప్రసాద్, శ్యామ్‌సన్ పాల్గొన్నారు.

సింహవాహనంపై కొలువుతీరిన భావదేవుడు

బాపట్ల, మే6 (ఆంధ్రజ్యోతి) : శ్రీమత్సుందరవల్లీ రాజ్యలక్ష్మీ సమేత శ్రీక్షీరభావన్నారాయణస్వామి 1432వ నవాహ్నిక వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా మంగళవారం స్వామివారు సింహవాహనంపై కొలువుతీరారు. ప్రత్యేకంగా అలంకరించిన వాహనంపై స్వామివారిని నగరోత్సవం చేశారు. భక్తులు స్వామివారి ఆశీస్సులు అందుకున్నారు. పండితులు శాస్త్రోక్తంగా కార్యక్రమాలను నిర్వహించారు.



సింహవాహనంపై ఊరేగుతున్న భావదేవుడు

ఉత్సవాలకు సహకరించిన వారికి కృతజ్ఞతలు : నరసింహమూర్తి

పిట్టలవానిపాలెం, మే6 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చందోలు గ్రామంలో ఉన్న శ్రీబగళాముఖి అమ్మవారి వార్షిక తిరునాళ్ళ, జన్మదిన వేడుకల సందర్భంగా జిల్లా, నియోజకవర్గ, మండల, చందోలు గ్రామపంచాయతీకి చెందిన వివిధ శాఖలకు చెందిన అధికారులందరూ దైవ కార్యక్రమాలకు సహకరించినందుకు ఆలయ కార్యనిర్వాహణాధికారి జి.నరసింహమూర్తి కృతజ్ఞతలు తెలిపారు. అధికారులు, భక్తులకు అమ్మవారి ఆశీస్సులు ఉండాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

కౌలు రైతులకు అధికారులు సహకరించాలి : తహసీల్దార్

పిట్టలవానిపాలెం, మే 6 (ఆంధ్రజ్యోతి) : గ్రామ వ్యవసాయ సహాయకులు 2025-2026 సంవత్సరానికి సంబంధించి అన్నిగ్రామాలలోని వ్యవసాయ భూములు సాగు చేస్తున్న వారికి కౌలు రైతు రుణ అర్హత కార్డులను మంజూరు చేసే లక్ష్యాలను రైతులకు అవగాహన కల్పించాలని తహసీల్దార్ డి.వెంకటేశ్వరరావు తెలిపారు. మండలంలోని 12 రైతు సేవా కేంద్రాల లో గల 3,550 కౌలు రైతుదారులకు ఈ రుణ అర్హత కార్డులను జారీ చేసేవిధంగా వీఆర్వోలు, గ్రామ వ్యవసాయ సహాయకులు సహకరించాలని ఆయన కోరారు.

శాఖా గ్రంథాలయాలలో విద్యార్థులకు సమ్మర్ క్యాంప్‌లు

కర్లపాలెం, మే6 (ఆంధ్రజ్యోతి) : కర్లపాలెం శాఖా గ్రంథాలయాలలో సమ్మర్ క్యాంప్‌లో భాగంగా విద్యార్థినీ, విద్యార్థుల చేత కథలు, పుస్తకాలు చదివించటం జరిగిందని గ్రంథాలయాధికారి టీవీ రమణమ్మ తెలిపారు. విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించటం, జీకే ప్రశ్నలు అడగటం జరిగిందని ఆమె చెప్పారు.

కారు ఢీకొని గేదె మృతి



మృతి చెందిన గేదె

కర్లపాలెం, మే 6 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నల్లమోతువారిపాలెం పంచాయతీ పరిధిలో జాతీయ రహదారిపై మంగళవారం తెల్లవారుజామున కారు ఢీకొని గేదె మృతి చెందిందని ఎస్ఐ రవీంద్ర తెలిపారు. గేదె యజమాని చిమటా వంశీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు. రెండు గేదెలు చనిపోయాయని ఎస్ఐ వివరించారు. ఈ విషయంపై కారు యజమాని వెంకటేశ్వరరావు మాట్లాడుతూ తెల్లవారుజామున నల్లమోతువారిపాలెంలో జాతీయ రహదారిపై పొలాలలో నుంచి ఒక గేదె వచ్చి తన కారును గుద్దుకుందని, కారు నుజ్జునుజ్జు అయ్యిందని కారులో సీటుబెల్ట్ పెట్టుకోవటం వల్ల తనకు ఎలాంటి ప్రమాదం సంభవించలేదని తెలిపారు. మరొక గేదె రోడ్డుపై ఉండగా కర్లపాలెం వైపు నుంచి వస్తున్న లారీ ఢీకొని వెళ్ళిపోయిందని వెంకటేశ్వరరావు తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ వివరించారు.

నేడు కార్మిక సంఘాల జిల్లా సదస్సు

బాపట్ల, మే6 (ఆంధ్రజ్యోతి) : కార్మిక సంఘాల జిల్లా సదస్సు బుధవారం బాపట్ల అంబేద్కర్ భవన్‌లో జరుగుతుందని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి సీహెచ్ మజుందార్ తెలిపారు. దేశవ్యాప్తంగా జరుగుతున్న సమ్మెలో కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిస్తూ ఈ సదస్సు నిర్వహిస్తున్నామన్నారు. ఈనెల 20న జరిగే సమ్మెను జయప్రదం చేయాలని కోరారు. ఉద్యోగులు, కార్మికులు తరలిరావాలన్నారు. సదస్సులో రాష్ట్రనాయకులు పాల్గొంటారన్నారు.

విజయం సాధించే అవకాశం ఉన్నప్పుడే ప్రగతి సాధ్యం

● కమిషనర్ రఘునాథరెడ్డి



గిరిజన కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న కమిషనర్ జి.రఘునాథరెడ్డి

బాపట్ల, మే 6 (ఆంధ్రజ్యోతి) : ప్రతి కుటుంబం విజయం సాధించే అవకాశం ఉన్నప్పుడే నిజమైన ప్రగతి సాధ్యమౌతుందని మున్సిపల్ కమిషనర్ జి.రఘునాథరెడ్డి అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, కలెక్టర్ జె.వెంకటమురళి ఆదేశాల మేరకు పి4 ఇనిషియేట్ ద్వారా సంపన్న పౌరుడు ఆర్థికంగా బలహీనంగా ఉన్న కుటుంబాలకు సామాజిక, ఆర్థిక, సంపూర్ణ సహాయం అందించటంలో తనవంతు బాధ్యతగా 5 గిరిజన బంగారు కుటుంబాలను దత్తత తీసుకున్నట్లు తెలిపారు. మూడో వార్డు రాజీవ్‌గాంధీ కాలనీకి చెందిన ఒక బంగారు కుటుంబం మొదగండి సంధ్య గృహాన్ని సందర్శించారు. వారితో కమిషనర్ కొంతసేపు మాట్లాడి పిల్లల విద్యకు తనవంతు సహాయసహకారాలు అందిస్తానని హామీనిచ్చారు. బాపట్ల పురపాలక సంఘంలో 13,336 కుటుంబాలను సర్వే చేయగా ప్రభుత్వం 2,359 కుటుంబాలను బంగారు కుటుంబాలుగా ఎంపిక చేసినట్లు తెలిపారు. ఆసక్తి ఉన్న పట్టణ పౌరులు పి4 ద్వారా 2,359 కుటుంబాలను దత్తతు తీసుకోవటం ద్వారా వారి బంగారు శ్రేయస్సుకు దోహదపడే భవిష్యత్తును సాకారం చేసుకోవటానికి సహకరించాలని కమిషనర్ కోరారు.

చెరువులోని కలుషిత నీటిని పూర్తిగా తొలగించాలి

పట్టణంలోని రెండో వార్డు రామకృష్ణపురంలో మరుగున పడిన చెరువును అభివృద్ధి చేసే కార్యక్రమంలో భాగంగా మంగళవారం మున్సిపల్ కమిషనర్ చెరువును పరిశీలించారు. చెరువులో ఎప్పటి నుంచో నిల్వ ఉన్న కలుషిత నీటి మొత్తాన్ని డ్రైనేజి ద్వారా బయటకు పంపించాలని సిబ్బందికి సూచించారు. చెరువుకు పూర్తి స్థాయిలో మరమ్మతులు చేసి సుందరీకరణ పనులు చేపట్టనున్నట్లు వివరించారు. ఇప్పటికే చెరువు చుట్టూ ఉన్న ముళ్ళచెట్లు, పొదలు తొలిగించిన ఇంజనీరింగ్ అధికారులు మిగిలిన పనులు కూడా త్వరితగతిన చేయాలని ఆదేశించారు. 3.39 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న చెరువును నిత్యం పర్యవేక్షిస్తూ ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ సూచనల మేరకు వాకింగ్ ట్రాక్, రీడింగ్ రూమ్, పార్క్ అభివృద్ధి పనులు త్వరలోనే ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ఎలక్ట్రిక్ ఆటోలపై అవగాహన : కమిషనర్

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన విజన్ -2047లో భాగంగా స్వయం సహాయక సంఘాల సభ్యులకు ఉపాధి కల్పించేవిధంగా ఎలక్ట్రిక్ ఆటోలను పంపిణీ చేసే విషయమై మంగళవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. మున్సిపల్ కార్యాలయంలో డ్రైవర్లకు వీటి గురించి వివరించి మెప్మా ద్వారా రాపిడోతో అనుసంధానమై 20 వేల రూపాయల డిస్కౌంట్‌తో 5 సంవత్సరాల కాలపరిమితితో 3.60 లక్షల రూపాయల విలువ చేసే ఎలక్ట్రిక్ ఆటోను ఇవ్వటం జరుగుతుందన్నారు. ఆటోలు ఛార్జింగ్ పెట్టుకునే విధానం, మైలేజి గురించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మెప్మా సీఎంఎం నర్రా సుబ్రహ్మణ్యం, సీవోలు, పట్టణ సమైక్య నాయకులు పాల్గొన్నారు.

శక్తి యాప్‌పై విస్తృత అవగాహన

బాపట్ల, మే 6 (ఆంధ్రజ్యోతి) : ఎస్పీ తుషార్ డూడి ఆదేశాల మేరకు జిల్లాలో శక్తియాప్‌పై విస్తృతంగా అవగాహన కల్పించారు. శక్తి బృందాలు అనేక ప్రాంతాలలో పర్యటించి మహిళలకు యాప్ పనిచేసే విధానం గురించి వివరించారు. బాపట్ల, రేపల్లె, చీరాలలో ఈ బృందాలు కోచింగ్ సెంటర్స్, ఫ్యాక్టరీలు, మాల్స్, బస్టాండ్‌లు, రైల్వేస్టేషన్‌లు, ఇతర కార్యాలయాలు, జనసమూహం ఉండే ఇతరప్రదేశాలతోపాటు పలు ముఖ్యమైన ప్రాంతాలను సందర్శించారు. యాప్ డౌన్‌లోడ్ చేసుకొనుట, వినియోగించటంపై వివరించారు. గుడ్‌టచ్, బ్యాడ్‌టచ్ గురించి వివరిస్తూ బాల్య వివాహాల నిషేధ చట్టం, సైబర్ నేరాలు, పోక్సో చట్టం, వివిధ హెల్ప్‌లైన్ నెంబర్లు గురించి వివరిస్తూ అవగాహన కల్పించారు.


టీబీపై అవగాహన కార్యక్రమం

బాపట్ల, మే 6 (ఆంధ్రజ్యోతి) : జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ కార్యాలయంలో మంగళవారం టీబీపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా లెప్రసి, ఎయిడ్స్ టిబి అధికారి డాక్టర్ మొహ్మద్ సాధిక్ మాట్లాడుతూ భవిష్యత్తులో టిబి రాకుండా చూడాలని టిబి ముక్తి పంచాయతీలుగా ఎన్నుకోబడిన గ్రామాలను టిబి రహిత గ్రామాలుగా రూపొందించుకోవాలని కోరారు. 2024 సంవత్సరంలో టిబి ముక్తు పంచాయతీలుగా ఎన్నుకోబడిన పంచాయతీ సెక్రటరీలను ఈసందర్భంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో జిల్లాపంచాయతీ అధికారి కె.ఎల్.ప్రభాకరరావు, వైద్యసిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

వైసీపీకి రాజకీయ సమాధి తప్పదు : కొల్లా

బాపట్ల, మే 6 (ఆంధ్రజ్యోతి) : అరాచక శక్తులను ప్రోత్సహించే వైసీపీకి రాజకీయ సమాధి తప్పదని సంగం డెయిరీ మాజీ ఛైర్మన్ కొల్లా వీరయ్యచౌదరి అన్నారు. ఆయన మంగళవారం మాట్లాడుతూ సత్యసాయి జిల్లాలో హత్యకు గురైన కార్యకర్త కుటుంబాన్ని పరామర్శించేందుకు వైసీపీ అధినేత జగన్ హెలీకాప్టర్‌లో వచ్చిన సందర్భంలో హెలీప్యాడ్ వద్దకు ముందస్తు కుట్రతో వైసీపీ గుంపులను రప్పించి గందరగోళం సృష్టించి పోలీసులపై సైతం దాడులకు పాల్పడి దానిని ప్రభుత్వ వైఫల్యంగా చిత్రించి అవాకులు, చెవాకులు పేలటం వైసీపీ విష సంస్కృతికి నిదర్శనమన్నారు. ఈ ఘటనలో గాయపడ్డ కానిస్టేబుల్ ఇచ్చిన ఫిర్యాదుతో అన్ని ఆధారాలతో అరాచక శక్తులను అరెస్ట్ చేసి మేజిస్ట్రేట్ ఎదుట హాజరుపర్చటాన్ని జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్, వైసీపీ మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్‌లు అవహేళన చేస్తూ ఇలాంటి అక్రమ కేసులతో తమను తమ కార్యకర్తలను భయపెట్టలేరంటూ బీరాలు పలకటం సిగ్గుచేటన్నారు.

బాపట్ల డీఎస్పీకి అడిషనల్ ఎస్పీగా పదోన్నతి



జి.రామాంజనేయులు

బాపట్ల, మే6 (ఆంధ్రజ్యోతి) : బాపట్ల డీఎస్పీ జి.రామాంజనేయులకు అడిషనల్ ఎస్పీగా పదోన్నతి లభించింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన దగ్గర నుంచి బాపట్ల డీఎస్పీగా విధులు నిర్వహిస్తున్న ఆయన నేరాల నియంత్రణకు విశేషంగా కృషి చేశారు. పదోన్నతి లభించిన ఆయనకు పోస్టింగ్ ఇవ్వాల్సి ఉంది. ఈ మేరకు ఆయనను పలువురు అభినందించారు.

మనస్థాపంతో మహిళ ఆత్మహత్యాయత్నం

కొల్లూరు, మే 6 (ఆంధ్రజ్యోతి) : సహజీవనం చేస్తున్న వ్యక్తి బెదిరింపులకు పాల్పడటంతో ఓ మహిళ ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... పోతార్లంక గ్రామానికి ఓ మహిళ తన భర్తతో మనస్పర్థలు తలెత్తడంతో ఐదు సంవత్సరాల నుంచి విడిగా ఉంటుంది. ఈ క్రమంలో గ్రామానికి చెందిన పరిశా గోపికృష్ణతో పరిచయం ఏర్పడి సహజీవనం చేస్తుంది. అతను అవసరమైనప్పుడల్లా విడతల వారీగా రూ.లక్షా 75 వేల నగదు అప్పుగా తీసుకున్నాడు. తన డబ్బులు తిరిగి ఇవ్వాలని అడుగగా ఇవ్వకపోగా తిరిగి మరో రూ.15 వేలు అడగటంతో తన వద్ద లేవని చెప్పింది. తన ఇంటి అవసరాల కోసం సామగ్రిని మహిళ కొనుగోలు చేయడంతో విషయం తెలుసుకున్న గోపికృష్ణ అసభ్యకరంగా మాట్లాడి నీకు, నాకు సంబంధం లేదని చెప్పగా నా వద్ద తీసుకున్న నగదును తిరిగి ఇవ్వాలని ఆమె కోరగా ఆగ్రహించిన గోపీకృష్ణ నా దగ్గర వీడియోలు, ఫొటోలు ఉన్నాయని, నువ్వే నాకు రూ.10 లక్షలు ఇవ్వాలని లేదంటే వాటిని ఆన్‌లైన్‌లో పెడతానని బెదిరించాడు. దీంతో మనస్థాపం చెందిన ఆమె ఈ నెల 4వ తేదీన ఎలుకల మందు తిని ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. గమనించిన మహిళ తల్లిదండ్రులు వెంటనే 108 అంబులెన్స్‌లో తెనాలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అక్కడ నుంచి మహిళ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఏఎస్ఐ అర్జునరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రమాదవశాత్తు వ్యక్తి మృతి



ఆదినారాయణ మృతదేహం

చెరుకుపల్లి, మే 6 (ఆంధ్రజ్యోతి) : చెరుకుపల్లి-తెనాలి రోడ్డులో ఉన్న కోత మిషన్‌లో జరిగిన ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన ఘటన మంగళవారం చోటు చేసుకుంది. ఆరుంబాక ఎస్సీ కాలనీకి చెందిన వేము ఆదినారాయణ ఉరఫ్ (సుమన్) 40 మృతి చెందాడు. స్థానికుల కథనం ప్రకారం ఒక కోత మిషన్ వద్ద ట్రాక్టర్ నుంచి తాటి చెట్లను దించుతుండగా వాటికి కట్టిన తాడు తెగిపోవడంతో అవి జారి ఆదినారాయణపై పడటంతో అతను మృతి చెందాడు. కాగా ఈ ప్రమాదంలో ముగ్గురు వ్యక్తులు తృటిలో తప్పుకున్నారు. స్థానిక ప్రవేటు వైద్యశాలకు తరలించగా అప్పటికే ఆదినారాయణ మృతి చెందినట్లు డాక్టర్ నిర్ధారించారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కాగా దీనిపై ఇప్పటి వరకు ఎలాంటి కేసు నమోదు కాలేదని ఎస్ఐ అనీల్‌కుమార్ తెలిపారు.

హనుమాన్ శోభాయాత్ర కరపత్రం ఆవిష్కరణ

వేమూరు, మే 6 (ఆంధ్రజ్యోతి) : హిందూ చైతన్య వేదిక ఆధ్వర్యంలో నిజాంపట్నం మండలం గరువుపాలెంలో ఈ నెల 18వ తేదీ నిర్వహించనున్న శ్రీ హనుమాన్ శోభాయాత్ర జయప్రదం చేయాలని కోరుతూ మంగళవారం మండలంలోని పెరవలిపాలెంలో కరపత్రాలు ఆవిష్కరించారు. ధార్మిక మండలి సభ్యులు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రతినిధులు మాట్లాడుతూ, సనాతన ధర్మాన్ని పరిరక్షించుకునేందుకు హిందువులంతా ఐక్యం కావాలని పిలుపునిచ్చారు. ఇందుకు ఆధ్యాత్మికత ఎంతో అవసరమన్నారు. గ్రామ గ్రామాన ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించాల్సిన అవసరం ఉందన్నారు. హిందూ చైతన్య వేదిక ద్వారా ప్రజలను చైతన్యపరిచేందుకు అనేక కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. హనుమాన్ శోభాయాత్రకు తాళ్లాయపాలెం శివస్వామీజీ, కేంద్ర సహాయ మంత్రులు, ఆధ్యాత్మిక ప్రచారకర్తలు పాల్గొంటారన్నారు. శోభాయాత్రకు వేలాదిగా తరలిరావాలని పిలుపునిచ్చారు.

ఆశా వర్కర్లకు కనీస వేతనం ఇవ్వాలి

రేపల్లె, మే 6 (ఆంధ్రజ్యోతి) : ఆశాలను కార్మికులుగా గుర్తించి కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ మణిలాల్ అన్నారు. ఈ సందర్భంగా మంగళవారం ఆయన మాట్లాడుతూ లేబర్ కోడ్ రద్దు చేయాలని, ఈనెల 20న దేశవ్యాప్తంగా చేస్తున్న సమ్మె జయప్రదం చేయాలని కోరారు. విశ్వేశ్వరం, మోళ్ళగుంట పీహెచ్‌సీలో మెడికల్ ఆఫీసర్లు సమ్మెలో పాల్గొననున్నట్లు సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని వారికి అందజేశారు. కష్టపడి పనిచేసే కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయాలని, కార్మికులను బానిసలుగా మార్చే లేబర్‌కోడ్‌ను అమలు చేయటం దారుణమన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు సీహెచ్ వీరలక్ష్మి, గ్లోరీ, పావని, దేవి, కె.ఆశీర్వాదం తదితరులు పాల్గొన్నారు.



క్లస్టర్ ఆఫీసర్ రమేష్‌కు వినతిపత్రాన్ని అందిస్తున్న సీఐటీయూ నాయకులు, ఆశా వర్కర్లు

బాలికలు పౌష్టికాహారం తీసుకోవాలి

● ఐసీడీఎస్ అసిస్టెంట్ ప్రాజెక్టు అధికారి విజయరాణి

వేమూరు, మే 6 (ఆంధ్రజ్యోతి) : కిషోర బాలికలు కౌమర దశలో పౌష్టికాహారం తీసుకుంటూ ఆరోగ్యవంతంగా ఉండాలని ఐసీడీఎస్ అసిస్టెంట్ ప్రాజెక్టు అధికారి విజయరాణి అన్నారు. చావలి, పెరవలి గ్రామాల్లో మంగళవారం కిషోర బాలిక వికాసం కార్యక్రమం నిర్వహించారు. సూపర్‌వైజర్ అమృతవాణి అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి హాజరైన విజయరాణి మాట్లాడుతూ, బాలికలు రుతుస్రావ సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పరిశుభ్రత వంటి అంశాలపై వీడియో ద్వారా అవగాహన కల్పించారు. తల్లిదండ్రులు తీసుకోవాలిస్సన బాధ్యతయుతమైన చర్యలను వివరించారు. కార్యక్రమంలో ఎంఎస్‌కె దుర్గ, అంగన్‌వాడీ కార్యకర్తలు నాంచారమ్మ, పద్మలక్ష్మి, మాణిక్యం, కిషోర బాలికలు హాజరయ్యారు.

అద్దంకివారిపాలెంలో అన్నసంతర్పణ

నగరం, మే 6 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని అద్దంకివారిపాలెంలో ఏర్పాటు చేసిన ఏకశిల 18 అడుగుల అభయాంజనేయస్వామి విగ్రహం ఏర్పాటు చేసి మూడేళ్ళు పూర్తయిన సందర్భంగా రాయన సుబ్బారావు ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. ఈసందర్భంగా మంగళవారం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామస్థులు, భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు రాయన బాపనయ్య, మన్నెం వెంకటేశ్వరరావు, రాయన నాగేశ్వరరావు, విచారపు కుటుంబరావు, రాయన వినోద్, రాయన నాగప్రవీణ్, రాయన లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మాతృమూర్తి ఈశ్వరమ్మ జయంతి



రోగులకు పాలు పండ్లు పంపిణీ చేస్తున్న సేవాసమితి సభ్యులు

కర్లపాలెం, మే 6 (ఆంధ్రజ్యోతి) : కర్లపాలెం సత్యసాయి సేవా సమితిలో సత్యసాయి బాబా మాతృమూర్తి ఈశ్వరమ్మ జయంతి వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. సేవా సమితి వారు వెంకటరమణ హాస్పటల్స్ ప్రజా వైద్యశాలలోని రోగులకు పాలు, పండ్లు, బ్రెడ్‌లు పంపిణి చేశారు. కార్యక్రమంలో సమితి కన్వీనర్ ఎస్వీ కిషోర్, గ్రామీణ సత్యసాయి సేవా సంస్థల జిల్లా కో ఆర్డినేటర్ తుమ్మల శ్రీనివాసరావు, ఆధ్యాత్మిక కో ఆర్డినేటర్ వెంకన్న, కోకి కృష్ణారెడ్డి, చంద్రారెడ్డి, సుబ్బారావు, ఎం.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

సారా విక్రయిస్తున్న నలుగురు అరెస్టు

బాపట్లరూరల్, మే 6 (ఆంధ్రజ్యోతి) : నాటు సారా విక్రయిస్తూ పట్టుబడిన నలుగురు వ్యక్తులను వెదుళ్ళపల్లి పోలీసులు మంగళవారం అరెస్ట్ చేశారు. వెదుళ్ళపల్లి ఎస్సై భాగ్యరాజు తెలిపిన వివరాలు ప్రకారం స్టూవర్టుపురం గ్రామానికి చెందిన కావటి శశిధర్, తమ్మిశెట్టి అనూష్‌కుమార్, దేవర నరసింహ, సాయిచందు అనే నలుగురు అర్ధరాత్రి స్టూవర్టుపురం గ్రామశివారులో నాటుసారా తయారు చేసి విక్రయిస్తుండగా వీరిని అదుపులోకి తీసుకొని అరెస్టు చేసి కోర్టుకు హాజరుపరచటం జరిగిందని తెలిపారు.



ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ఆనందబాబు

ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులు అందజేత

భట్టిప్రోలు (కొల్లూరు) మే 6 (ఆంధ్రజ్యోతి) : ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి వచ్చిన చెక్కులను ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు లబ్ధిదారుల కుటుంబ సభ్యులకు మంగళవారం అందజేశారు. మండల పరిధిలోని పెదపులివర్రుకు చెందిన కందుల అర్జునమ్మకు రూ.41,886లు, ఓలేరుకు చెందిన ముమ్మలనేని మల్లికార్జునరావుకు రూ.40,095లు, రాచూరుకు చెందిన చిలకా సామ్రాజ్యంకు రూ.37,878లు, భట్టిప్రోలుకు చెందిన అడిగొప్పుల విజయమారుతీ మణికి రూ.25 వేలు, ఐలవరంనకు చెందిన జొన్నాదుల హేమలతకు రూ.20 వేలు చొప్పున మంజూరైన చెక్కులను ఎమ్మెల్యే గుంటూరులోని క్యాంపు కార్యాలయంలో లబ్ధిదారుల కుటుంబ సభ్యులకు అందజేశారు. ఆయా లబ్ధిదారుల కుటుంబ సభ్యులు సీఎం చంద్రబాబు, ఎమ్మెల్యే ఆనందబాబుకు తమ కృతజ్ఞతలు తెలిపారు.

మహిళా ఉద్యోగులకు నిబంధనల ప్రకారం సెలవులు ప్రకటించాలి

రేపల్లె, మే 6 (ఆంధ్రజ్యోతి) : పురపాలక సంఘంలో పని చేస్తున్న అవుట్ సోర్సింగ్, కాంట్రాక్టు మహిళా ఉద్యోగులకు సంబంధించి జీవోనెం.39ప్రకారం క్యాజువల్ లీవ్‌లైన 15 రోజులు, అదనంగా మరో 5 రోజులు లీవ్‌లు తీసుకోవటానికి సెలవులు మంజూరు చేయాలని మున్సిపల్ వర్కర్స్ యూనియన్ కమిటీ అధ్యక్షుడు పడమటి బిక్షాలు అన్నారు. స్థానిక పురపాలకసంఘ కార్యాలయం వద్ద మంగళవారం కాంట్రాక్టు అవుట్‌సోర్సింగ్ మహిళా ఉద్యోగులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళా ఉద్యోగుల సమస్యలను పరిష్కరించే విధంగా అధికారులు చర్యలు చేపట్టాలని కోరారు. 20వ తేదీన దేశవ్యాప్తంగా సార్వత్రిక సమ్మెకు సంబంధించిన సమ్మె నోటీస్‌ను మున్సిపల్ కమిషనర్ కె.సాంబశివరావుకు అందించారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు కోన శ్రీను, అంగన్‌వాడీ వర్కర్స్ హెల్పర్స్ అసోసియేషన్ బాపట్ల జిల్లా కన్వీనర్ సింగం వాణిశ్రీ, భూపతి రాజేశ్వరి, రమాదేవి, కుమారి, అనురాధ, ఏసుబాబు, నారాయణ, ముఖర్జీ తదితరులు పాల్గొన్నారు.



మున్సిపల్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న అవుట్‌సోర్సింగ్ కాంట్రాక్టు మహిళా ఉద్యోగులు

ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన

కొల్లూరు, మే 6 (ఆంధ్రజ్యోతి) : ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మండల పరిధిలోని సుగ్గునలంకలో వెలుగు ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయంపై మంగళవారం గ్రామసభ, ర్యాలీ నిర్వహించారు. అనంతరం గ్రామ సచివాలయం వద్ద నిర్వహించిన గ్రామసభలో యూనిట్ ఇన్‌చార్జి జీవీ కృష్ణ, శివనాగేశ్వరమ్మ మాట్లాడుతూ, ప్రకృతి వ్యవసాయం చేయడం వల్ల వ్యవసాయ ఖర్చులు తగ్గడంతో పాటు మేలైన ఆరోగ్యకరమైన పంట ఉత్పత్తులు చేతికి అందుతాయన్నారు. ఖరీఫ్ యాక్షన్ ప్లాన్‌లో భాగంగా భూసార పరీక్షలు నిర్వహించుకుని పచ్చిరొట్ట విత్తనాలు సాగు చేసుకుని భూసారాన్ని పెంపొందించుకోవాలన్నారు. ప్రకృతి వ్యవసాయ పద్ధతుల గురించి రైతులకు వివరించారు. గ్రామంలో అభ్యుదయ రైతులు సుగ్గున సాంబశివరావు, గొనే వెంకటేశ్వరరావును సత్కరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ శీలం అంకమరావు, యానిమేటర్ మాధవి, వీవో అధ్యక్షులు విజయలక్ష్మి, ఏపీసీఎన్ఎఫ్ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

వాసవీ అమ్మవారికి సహస్ర కలశాభిషేకం, శ్రీచక్రార్చన

భట్టిప్రోలు (కొల్లూరు) మే 6 (ఆంధ్రజ్యోతి) : వాసవీ అమ్మవారి జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని సహస్ర కలశాభిషేకం, శ్రీచక్రార్చన నిర్వహించారు. మండలం కేంద్రం భట్టిప్రోలులోని వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలో అమ్మవారికి తొలుత ఆర్యవైశ్య మహిళలు, కన్యలు కృష్ణానది నుంచి బిందె తీర్థం తీసుకువచ్చి అమ్మవారి మూలవిరాట్‌కు నవరస ఫల సహిత పంచామృతాలతో సహస్ర కలశాభిషేకాన్ని మంగళవారం మద్దుల వెంకటేశ్వరరావు, అనురాధ దంపతులు నిర్వహించారు. ఉదయం 8 గంటలకు శ్రీచక్రార్చన, కుంకుమపూజ నిర్వహించారు. రాత్రి 7 గంటలకు వాసవీ అమ్మవారి ఉత్సవ మూర్తికి మల్లెపూలతో పూజా కార్యక్రమం నిర్వహించారు. ఆయా పూజాది కార్యక్రమాలను జానపాటి లీలావేణుగోపాలస్వామి బృందం నిర్వహించగా దేవస్థాన కమిటీ అధ్యక్షుడు తూనుగుంట్ల సాయిబాబా, మహిళ కమిటీ అధ్యక్షులు బూరెల అరుణకుమారి, సభ్యులు పర్యవేక్షించారు.



వాసవీ అమ్మవారికి సహస్ర కలశాభిషేకం కోసం బిందెలతో కృష్ణానది నీటిని తీసుకువచ్చిన మహిళలు

బీసీ కులగణన నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాం : బీజేపీ

రేపల్లె, మే 6 (ఆంధ్రజ్యోతి) : దేశ వ్యాప్తంగా బీసీ కులగణన చేపట్టాలని కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామని బీజేపీ రాష్ట్ర అగ్నికుల క్షత్రియ వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ విశ్వనాథపల్లి వెంకటేశ్వరరావు అన్నారు. ఆయన మంగళవారం మాట్లాడుతూ దేశ జనాభాలో వెనుకబడిన తరగతులు ఎంతోమంది ఉన్నారని అన్నారు. ఇప్పటికైనా బీసీల జనాభా ప్రాతిపదికన రావాల్సిన వాటా దామాషా ప్రకారం విభజించాలని కోరారు. ఉపాధి, ఉద్యోగ, రాజకీయ అన్ని రంగాల్లో బీసీలకు జరుగుతున్న అన్యాయానికి స్వస్తిపలికి న్యాయం చేయాలని కోరారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఆధ్వర్యంలో తీసుకున్న నిర్ణయం వల్ల ఆయా బీసీ కులాలకు చేయూతనిచ్చే దిశగా ఉంటుందని తెలిపారు.

9న చుండూరులో పబ్లిక్ గ్రీవెన్స్ సెల్

చుండూరు (వేమూరు), మే 6 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రమైన చుండూరు గ్రామంలో ఈ నెల 9వ తేదీ ఉదయం 10 గంటలకు సొసైటీ బిల్డింగ్‌లో పబ్లిక్ గ్రీవెన్స్ సెల్ ఏర్పాటు చేయనున్నట్లు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయ వర్గాలు తెలిపాయి. కార్యక్రమానికి ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు హాజరవుతారని, మండల పరిధిలోని ప్రజలు కార్యక్రమంలో పాల్గొని సమస్యలకు సంబంధించిన అర్జీలను ఎమ్మెల్యేకు అందించి పరిష్కారం చేసుకోవాలని తెలిపారు.

దొంగతనాలకు పాల్పడిన ఇద్దరు అరెస్టు

బాపట్ల రూరల్, మే6 (ఆంధ్రజ్యోతి) : దొంగతనానికి పాల్పడిన ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసినట్టు బాపట్లరూరల్ పోలీసులు తెలిపారు. వివరాల్లోకి వెళితే.. బాపట్ల మండలం పోతురాజు కొత్తపాలెంలో సోమవారం అర్ధరాత్రి సమయంలో ముగ్గురు వ్యక్తులు ఇళ్ళల్లో దొంగతనానికి పాల్పడగా గ్రామస్తులు దొంగలను పట్టుకునే సమయంలో ఒకరు పారిపోగా ఇద్దరిని అదుపులోకి తీసుకొని బాపట్ల రూరల్ పోలీసులకు అప్పగించారు. వెదుళ్ళపల్లికి చెందిన కె.వంశీ, కమలహాసన్ అనే ఇద్దరిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపర్చటం జరిగిందని రూరల్ పోలీసులు తెలిపారు.


పిడుగురాళ్లలో కొన్నేళ్లుగా మూతపడి ఉన్న బాయిల్డ్ రైస్‌మిల్

- పదేళ్ల క్రితం ఓ వెలుగు వెలిగిన మిల్లులు
- వ్యాపారం లేక మూతపడిన వైనం
- ఇతర రాష్ట్రాల్లో ఏర్పాటుతో తీవ్ర పోటీ..
- పిడుగురాళ్లలో వెయ్యి మందికిపైగా ఉపాధి
- నేడు శిథిలావస్థకు.. తుప్పుపడుతున్న యంత్రాలు

బాయిల్డ్ రైస్ మిల్లులకు.. గ్రహణం


పిడుగురాళ్లలో పిచ్చి చెట్ల మధ్య శిథిలమవుతున్న బాయిల్డ్ యంత్రం

పిడుగురాళ్ల, మే 6 (ఆంధ్రజ్యోతి): పల్నాడు ప్రాంతంలో పిడుగురాళ్ల అంటే తెలియనివారు ఉండరు.. సున్నం పరిశ్రమలతో లైమ్ సిటీగా పేరొంది... బాయిల్డ్ రైస్ మిల్లుల రంగంలో ఒక ముద్ర వేసుకుంది. వేలాది మందికి ఉపాధి చూపిన బాయిల్డ్ రైస్ మిల్లులు నేడు వెలవెలబోతున్నాయి. ఉమ్మడి గుంటూరు జిల్లాలో ఇక్కడ పదేళ్ల క్రితం వరకు 15 వరకు అతిపెద్ద బాయిల్డ్ రైస్ మిల్లులు పనిచేశాయి. రబీ సాగులో ధాన్యాన్ని వ్యాపారులు కొనుగోలు చేసి.. బాయిల్డ్ రైస్‌గా రాష్ట్రంలోని కొన్ని ప్రాంతాలతో పాటు కేరళ, తమిళనాడుకు సరఫరా చేసేవారు. బాయిల్డ్ రైస్‌ను ప్రభుత్వం తీసుకోకపోవడం, వర్షాభావ ప్రభావం వల్ల పల్నాడు ప్రాంతంతో పాటు పలు ప్రాంతాల్లో రెండవ పంటగా వరి సాగు లేకపోవడంతో క్రమ క్రమంగా బాయిల్డ్ రైస్ మిల్లులకు గ్రహణం పట్టింది.

ఇతర రాష్ట్రాల్లో బాయిల్డ్ రైస్ మిల్లులు..

సగం విరిగిన ధాన్యాన్ని బాయిల్డ్ రైస్‌కు ఉపయోగించేవారు. బోర్లు, బావులతో సాగునీరు పుష్కలంగా అందుతుండటంతో వరి ధాన్యం దిగుబడి నాణ్యత బాగుంటోంది. అవి బాయిల్డ్ రైస్‌గా ఉపయోగించేందుకు వీలుపడటం లేదు. కాలానుగుణంగా తూర్పు గోదావరి జిల్లా, తెలంగాణలోని మిర్యాలగూడలో విస్తారంగా బాయిల్డ్ రైస్ మిల్లులు ఏర్పడటంతో పిడుగురాళ్లలో బాయిల్డ్ రైస్ మిల్లులు వెనుకబడ్డాయి. ఒకప్పుడు పిడుగురాళ్లలో బాయిల్డ్ రైస్‌మిల్లులు పనిచేసిన సమయంలో పిడుగురాళ్ల, జానపాడుతో పాటు సమీప గ్రామాల్లోని పురుషులు, మహిళలకు ఒక్కో మిల్లులో రోజుకు 100 మంది వరకు ఉపాధి లభించేది. కేరళ, తమిళనాడులో కూడా అక్కడ రైతులు పండించిన ధాన్యాన్నే ఎక్కువగా ఉపయోగిస్తున్నారు. ఫలితంగా పిడుగురాళ్లలో ఒకప్పుడు కళకళలాడిన బాయిల్డ్ రైస్ మిల్లులు నేడు వెలవెలబోతున్నాయి. రూ.లక్షల ఖరీదు చేసే బాయిల్డ్ యంత్రాలు, మిల్లుల్లో సామగ్రి అంతా తుప్పుపడుతున్నాయి. ఆ యంత్రాలను మరొకరికి విక్రయించేందుకు వ్యాపారులు సిద్ధంగా ఉన్నప్పటికీ నేటి టెక్నాలజీకి అనుగుణంగా తయారైన యంత్రాలనే ఇప్పటి వ్యాపారులు కొనుగోలు చేస్తుండటంతో.. భారీ యంత్రాలన్నీ నిరుపయోగంగా పడిఉన్నాయి.

ఆనాటి కళ ఇక రాదు

-కట్టమూరి శంకరరావు, వ్యాపారి



దాదాపు పదేళ్ల క్రితం రోజుకు వెయ్యి మందికి పైగా పిడుగురాళ్లలో ఉపాధి లభించే అవకాశం ఒక్క బాయిల్డ్ రైస్ మిల్లులకే ఉండేది. వ్యాపారులకు తగిన ఆదాయం, స్థానికులకు ఉపాధి చూపించామన్న సంతృప్తి ఉండేది. బాయిల్డ్ రైస్ మిల్లులు సమీప జిల్లా అయిన మిర్యాలగూడ, పొరుగు రాష్ట్రాలలో ఏర్పడటంతో క్రమ క్రమంగా పిడుగురాళ్లలో బాయిల్డ్ రైస్ మిల్లులన్నీ మూత పడ్డాయి.

సాగుకు పరీక్ష

వ్యవసాయరంగాన్ని నమ్ముకున్న రైతులకు నానాటికి పెట్టుబడులు పెరగడం తప్ప.. దిగుబడులు ఆశించినంత స్థాయిలో రావడంలేదు. ఫలితంగా నష్టాలబారిన పడటమా లేదా పెట్టుబడికి తగ్గ దిగ్గుబడితో సరిపుచ్చుకోవడమో జరుగుతుంది. అందుకు ప్రధాన కారణంగా పంట వేసే ముందు భూసార పరీక్షలు పూర్తి స్థాయిలో జరపకపోవడమేనని పలువురు వ్యవసాయరంగ నిపుణులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.


దుక్కి దున్ని ఉన్న పంటపొలం

- సకాలంలో నిర్వహించిన భూసార పరీక్షలు
- వ్యవసాయశాఖ నిర్లిప్తతో రైతులకు నష్టం
- పెరుగుతున్న పెట్టుబడులు, దిగజారుతున్న దిగుబడులు
- పోషకాల లోపమే అంటున్న నిపుణులు
- తొలిదశలో గుర్తించకపోవడంతో.. అధికంగా ఎరువుల వినియోగం
- డెల్టాలో ఖరీఫ్, రబీలో వేర్వేరు పంటల సాగు
- ప్రస్తుతం దుక్కులు సిద్ధం చేస్తున్న రైతులు

తెనాలిరూరల్, మే 6 (ఆంధ్రజ్యోతి): తెనాలి ప్రాంతంలో అధికంగా రైతు కుటుంబాలే తరతరాల నుండి వ్యవసాయంపై ఆధారపడి జీవనం సాగిస్తున్నాయి. ఇందులో ఎక్కువగా నిరక్షరాస్యులే ఉండటం విశేషం. ఈ ప్రాంతంలో ఏడాదికి రెండు పంటలు పండే వీలుంది. ఖరీఫ్, రబీ సీజన్లలో వరి, జొన్న, మొక్కజొన్న వంటి పంటలు సాగు చేస్తుంటారు. గతంలో ఎకరాకు 40-50 బస్తాలకుపైగా ధాన్యం పండేది. రాను రాను దిగుబడులు తగ్గి.. పెట్టుబడులు పెరిగాయి. యూరియా, డీఏపీ వంటి ఎరువులు గతంలో తక్కువగా వినియోగిస్తేనే పంటల ఎదుగుదల చక్కగా ఉండేది. ఎరువుల వాడకం పెరడంతో.. దిగుబడి తగ్గడంతో పాటు చీడపీడల వ్యాప్తికూడా పెరుగుతోంది. ఇందుకు ప్రధానంగా భూమిలో పోషకలోపాలను తొలిదశలోనే గుర్తించకపోవడమేనని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

సాగుకు ముందే భూసార పరీక్షలు తప్పనిసరి

దుక్కి సమయంలో సాగు భూమి మధ్య నుండి కొంత మట్టిని నమూనాగా తీసుకుని.. దానిని సాయిల్ టెస్టింగ్ ల్యాబ్‌కు పంపాలి. అప్పుడే భూమిలోని పోషక లోపాలు, విలువలు గుర్తించడంతో పాటు పంటల సాగుకు అనువైన విత్తన రకాలనూ తెలుసుకోనే అవకాశం ఉంటుంది. పోషక లోపాలు గుర్తిస్తే.. నివారణకు అవసరమైన చర్యలు చేపట్టవచ్చు. గతంలో జింక్ లోపాన్ని గుర్తించి.. నివారణకు అధికంగా జింక్‌ను రైతులు వినియోగించారు. ప్రస్తుతం సాగు పూర్తిచేసుకున్న రైతులు దుక్కులు దున్ని.. భూములు పదును పెట్టుకునే పనిలో నిమగ్నమయ్యారు. ఇప్పటి నుంచే వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు భూసార పరీక్షలపై అవగాహన కల్పించి, శాంపిల్స్ పరీక్షలు చేయించి, లోపాలను తెలుసుకోవాలి. రైతులకు నస్యరక్షణ చర్యలను వివరించాలి.

రైతు సేవా కేంద్రాల్లో భూసార పరీక్షలు..

రైతు సేవా కేంద్రాల వద్దే భూసార పరీక్షలు ఏర్పాటు చేస్తే రైతులకు మేలు జరుగుతుంది. ఎప్పటికప్పుడు పరీక్షలు జరిపి లోపాలను వెంటనే తెలిపే అవకాశం ఉంటుంది. దీని ద్వారా తక్షణమే సస్యరక్షణ చర్యలు చేపడితే రాబోయే పంట సాగుకు పూర్తిగా పెట్టుబడులు తగ్గడంతో పాటు అనువైన విత్తనాన్ని ఎంపిక చేసుకునే అవకాశం ఉంటుంది.

తూతూ మంత్రంగా భూసార పరీక్షలు

గత వైసీపీ ప్రభుత్వంలో భూసార పరీక్షలు తూతూ మంత్రంగానే జరిగాయన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేసి.. సేవలు మాత్రం అంతంతమాత్రంగానే ఉంచిందన్న విమర్శలున్నాయి. వ్యవసాయానికి ప్రధాన భూమిక పోషించే సాలిడ్ టెస్టులను ఆర్బీకేల్లో ఏర్పాటు చేయకపోవడంతో రైతులకు భూసారం గురించి తెలుసుకునేందుకు అవకాశం తక్కువగా ఉండేది. సాగు సమయం ఆసన్నమయ్యే సమయంలో వ్యవసాయశాఖ సిబ్బంది హడావుడి చేసి స్వల్ప సంఖ్యలోనే శాంపిల్స్ తీసుకునే వారని రైతులు చెబుతున్నారు. వాటిని జిల్లా సాలిడ్ టెస్టింగ్ ల్యాబ్‌కు పంపేవారని..ఫలితాలు వచ్చేసరికి సాగుపనులు కూడా ప్రారంభమయ్యేవని అంటున్నారు. దీంతో పరీక్షలకు మట్టి తీసుకున్నా రైతాంగానికి మేలు జరిగిందేమిలేదన్న విమర్శలున్నాయి.

చిక్కడు, దొరకడు.. చిన్నోడు!

● నియోజకవర్గాన్ని విడిచి పరారై సంవత్సరం ● అజ్ఞాతంలో మాజీ ఎమ్మెల్యే సోదరుడు ● అన్న జన్మదిన వేడుకల్లో ప్రత్యక్షం



మాచర్లటౌన్, మే 6 (ఆంధ్రజ్యోతి): మాచర్ల నియోజకవర్గాన్ని వైసీపీ ప్రభుత్వ హయాంలో టెర్రరైజ్ చేసి, అన్నీ తానై అన్నను మించి షాడోగా సాగించుకున్న పిన్నెల్లి వెంకట్రామిరెడ్డి (చిన్నోడు) నియోజకవర్గానికి మొహం చాటేసి సంవత్సరం కావొస్తోంది. మాజోలికి వచ్చే దెవరు.. మాజోలికొచ్చి తట్టుకునేదెవరూ అంటూ ప్రగల్భాలు పలికిన వ్యక్తి.. తెలంగాణలో తలదాచుకొని వ్యాపారాలు చేసుకుంటూ.. ఆదాయాన్ని గడిస్తున్నాడు. పాపం ఆయనను నమ్ముకున్న చోటా మోటా నాయకులు, కార్యకర్తలు కొంతమంది జైలుపాలు కాగా, మరికొంతమంది ఇతర రాష్ట్రాల్లో అజ్ఞాత జీవితం గడుపుతున్నారు.

హౌస్ అరెస్ట్ నుంచి పరారై..

ఎన్నికల పోలింగ్, మరుసటి రోజు జరిగిన దాడుల్లో గతేడాది మే 14న పోలీసులు మాచర్లలో పిన్నెల్లి వెంకట్రామిరెడ్డిని హౌస్ అరెస్ట్ చేశారు. పోలీసుల కన్నుగప్పి అర్ధరాత్రి వేళ పీవీఆర్ పరారై నేటికి సుమారు ఏడాది కావొస్తోంది. అప్పటి నుంచి ఇప్పటి వరకు మాచర్ల నియోజకవర్గంలో అడుగు పెట్టలేదు. తనను నమ్ముకున్న కార్యకర్తలకు కూడా తాను ఎక్కడ ఉన్నాడో చెప్పకుండా అజ్ఞాత జీవితాన్ని కొనసాగిస్తున్నాడు. తన ఆధిపత్యంలో సహకరించిన నాయకులు, కార్యకర్తలు కొంతమంది జైలుపాలు కాగా, మరికొంతమంది నియోజకవర్గం విడిచి పొరుగు రాష్ట్రాల్లో తలదాచుకుంటున్నారు. అధికారంలో ఉన్నప్పుడు అప్పటి ప్రతిపక్ష నాయకుడు, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి జూలకంటి బ్రహ్మానందరెడ్డిని ఎన్నికల్లో ఓడిపోతే నియోజకవర్గం వదిలిపెట్టి పోతాడని తూలనాడిన వెంకట్రామిరెడ్డి... నేడు వైసీపీ అధికారం కోల్పోవడంతో మాచర్ల నియోజకవర్గంలోకి అడుగు పెట్టడానికి కూడా సాహసం చేయలేకపోతున్నాడు. అంగ బలం, అర్థబలంతో తనపై నమోదైన కేసులన్నింటిపై కోర్టుకెళ్లి బెయిల్ పొందగలిగాడు. నమ్ముకున్న వారు మాత్రం డబ్బుల్లేక, కుటుంబ పోషణ భారమై నరకయాతన పడుతున్నారు.

పోలీసులు ఉదాసీన వైఖరితో..

ఈ మధ్యన విడుదలైన పుష్ప-2 సినిమాలో.. హీరో దమ్ముంటే పట్టుకోరా షికావత్ అంటూ.. పోలీసు ఆఫీసర్‌కు సవాల్ విసిరే సన్ని వేశం ప్రేక్షకులను ఆకట్టుకుంది. మాచర్లలో అదే స్థాయిలో పిన్నెల్లి వెంకట్రామిరెడ్డి పలు కేసుల్లో నిందితుడు అయినప్పటికీ పోలీసులకు చిక్కకుండా సవాల్ విసురుతున్నారు. కూటమి ప్రభుత్వం కొలువుదీరినా..వెంకట్రామిరెడ్డి వ్యవహారంలో మాచర్ల పోలీసులు ఉదాసీనత వైఖరిని అవలంబించారని విమర్శలు వస్తున్నాయి. గత ఫిబ్రవరి 15న తన సోదరుడు, మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి జన్మదినం సందర్భంగా హైదరాబాద్‌లో నిర్వహించిన వేడుకల్లో మొదటి సారిగా ప్రత్యక్షమయ్యాడు. అధికారాన్ని అడ్డుపెట్టుకొని అనేక వ్యాపారాలు చేసి, కూడబెట్టుకున్న ఆస్తులతో పోలీసులు తన జోలికి రాకుండా చేసుకోవడంలో ఆయన విజయవంతం కాగలిగాడు.

12 కేసుల్లో నాలుగు 307 సెక్షన్లు..

- గతేడాది మే 13న సాధారణ ఎన్నికల ఓటింగ్ జరిగింది. ఆ సమయంలో పోలింగ్ బూత్‌ల వద్ద దాడులు చేయడం, మరుసటి రోజు కారంపూడిలో కార్యకర్తలతో టీడీపీ కార్యాలయం, నాయకుల ఆస్తులను ధ్వంసం చేశారు. అడ్డుకున్న సీఐ నారాయణ స్వామిపై దాడి చేసి, గాయపరచడం వంటి పలు కేసుల్లో 12 కేసులు నమోదయ్యాయి. ఇందులో నాలుగు 307 సెక్షన్ కింద కేసులు నమోదయ్యాయి.
- 2022 డిసెంబరు 16న మాచర్ల పట్టణంలో టీడీపీ కార్యాలయం, నాయకుల గృహాలు ధ్వంసం, కార్లకు నిప్పు పెట్టడం వంటి కేసుల్లో పిన్నెల్లి వెంకట్రామిరెడ్డిపై 307 కేసు నమోదైంది. ఎన్నికల ఓటింగ్ రోజున వెల్దుర్తి మండలం కండ్లకుంటలో ఏజెంట్‌గా కూర్చున్న నోముల మాణిక్యంను బెదిరించిన కేసులో ఎస్సీ, ఎస్టీ కేసు కూడా నమోదు చేశారు.
- అదే రోజు పట్టణంలోని పీడబ్ల్యూడీ కాలనీలో టీడీపీ నేత యెనుముల కేశవరెడ్డి గృహంపై దాడి చేసి, ధ్వంసం చేయడంతో పాటు సుమారు 12 మంది కార్యకర్తలను కారుతో ఢీకొట్టి గాయపరిచారు. వాహనాలను ధ్వంసం చేయడంతో 307 నమోదైంది.
- 2014లో మాచవరం మండలం చెన్నాయపాలెంలో సరస్వతీ సిమెంట్స్‌కి భూములు ఇచ్చిన రైతులపై దాడి కేసులో 307తోపాటు ఎస్సీ, ఎస్టీ కేసులో నిందితుడిగా వెంకట్రామిరెడ్డి ఉన్నారు.

గ్రీన్‌ఫీల్డ్ హైవే నిర్మాణానికి సహకరించాలి

● గుంటూరు, బాపట్ల జిల్లాల అధికారులతో ఎంపీ కృష్ణప్రసాదు


స్టేక్‌హోల్డర్స్ సమావేశంలో పాల్గొన్న బాపట్ల ఎంపీ కృష్ణ ప్రసాదు, ఎమ్మెల్యేలు నక్కా ఆనందబాబు, వేగేశన నరేంద్రవర్మ బాపట్ల జిల్లా కలెక్టర్ వెంకటమురళి తదితరులు

గుంటూరు, మే 6 (ఆంధ్రజ్యోతి): అమరావతి ఔటర్ రింగ్ రోడ్డు నుంచి నిజాంపట్నం పోర్టు వరకు కొత్తగా(గ్రీన్ ఫీల్డ్) నాలుగు వరసల రోడ్డు నిర్మాణానికి సంబంధిత ప్రభుత్వ శాఖలు సహకరించాలని బాపట్ల ఎంపీ టి.కృష్ణప్రసాదు విజ్ఞప్తి చేశారు. మంగళవారం సాయంత్రం ఈ హైవే ప్రాజెక్టుపై సంబంధిత ప్రభుత్వ శాఖల అధికారులతో ఆయన గుంటూరు కలెక్టరేట్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో గుంటూరు జిల్లా కలెక్టర్ ఎస్ నాగలక్ష్మి, బాపట్ల కలెక్టర్ జె.వెంకట మురళి, గుంటూరు జేసీ ఎ.భార్గవ్ తేజ, ఎమ్మెల్యేలు నక్కా ఆనందబాబు, వేగేశన నరేంద్ర వర్మ, తెనాలి సబ్ కలెక్టర్ సంజనా సిన్హా, జీఎంసీ కమిషనర్ పులి శ్రీనివాసులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీ కృష్ణప్రసాద్ మాట్లాడుతూ అమరావతి ఔటర్ రింగ్ రోడ్డు నుంచి నిజాంపట్నం పోర్ట్ వరకు కొత్తగా (గ్రీన్‌ఫీల్డ్) నాలుగు వరసల హైవేని 47.848 కిలోమీటర్ల పొడవునా నిర్మాణం చేయాల్సి ఉందన్నారు. ఈ రహదారి నిర్మాణానికి సంబంధిత కేంద్రమంత్రులతో అనేక దఫాలు చర్చించి, వారిని ఒప్పించి ప్రాజెక్టుని మంజూరు చేయించడం జరిగిందన్నారు. ఈ రోడ్డు నిర్మాణ పనులు పూర్తి అయితే సూర్యలంక, చీరాల బీచ్‌తో పాటు అనేక ఆధ్యాత్మిక ప్రదేశాలు, పొన్నూరులోని వీరాంజనేయ స్వామి దేవస్థానం పర్యటకాభివృద్ధి చెందుతా యన్నారు. రోడ్డు నిర్మాణ పనులకు అన్ని అనుమతులు పొందిన తర్వాత ఆరు నెలల్లో భూసేకరణ, 18 నెలల్లోపు రోడ్డు నిర్మాణ పనులు పూర్తి చే యాలని తన ఆకాంక్షను తెలిపారు. స్టేక్ హోల్డర్స్ అయిన ఆర్అండ్‌బీ, విద్యు త్, ఇరిగేషన్, రైల్వే, ఫిషరీస్, అగ్రికల్చర్, పంచాయతీ రాజ్, దేవదాయ, అటవీశాఖ అధికారులు తమ శాఖలకు సంబంధించి ఏవైనా అంశాలు ఉంటే పూర్తి వివరాలతో శుక్రవారం సాయంత్రంలోపు అందించాలని కలెక్టర్లు నాగ లక్ష్మి, జె.వెంకట మురళి ఆదేశించారు. వాటిని క్రోడీకరించి ప్రాజెక్టు రిపోర్ట్‌ను నేషనల్ హైవే అథారిటీకి పంపి, రోడ్డు నిర్మాణానికి అనుమతులు కోరడం జరుగుతుందన్నారు. పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా నేషనల్ హైవే అథారిటీ అధికారులు రోడ్డు నిర్మాణాన్ని వివరించారు. ఎన్‌హెచ్ఏఐ ప్రాజెక్టు అధికారి పార్వతీశం, డీఆర్ఓ ఎస్ఎస్‌కే ఖాజావలి, పంచాయతీ రాజ్ ఎస్ఈ బ్రహ్మయ్య, డీపీఓ నాగసాయికుమార్ వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.


ఎడ్ల పోటీలను ప్రారంభిస్తున్న మంత్రులు అనగాని, గొట్టిపాటి, ఎంపీ కృష్ణ ప్రసాద్, ఎమ్మెల్యే నరేంద్ర


బహుమతి ప్రదానం చేస్తున్న మంత్రి నాదెండ్ల మనోహర్, ఎమ్మెల్యేలు ధూళిపాళ్ల నరేంద్ర, గళ్లా మాధవి

పౌరుషానికి ప్రతీక ఒంగోలు జాతి ఎడ్లు

● ఎడ్ల బల ప్రదర్శనలో రాష్ట్ర మంత్రులు

పొన్నూరుటౌన్, మే 6(ఆంధ్రజ్యోతి): తెలుగు జాతి పౌరుషానికి ఒంగోలు జాతి ఎడ్లు ప్రతీక అని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ పేర్కొన్నారు. చేబ్రోలు మండలం వడ్లమూడిలో ధూళిపాళ్ల వీరయ్య చౌదరి మెమోరియల్ జాతీయస్థాయి వృషభరాజాల బల ప్రదర్శన పోటీలు మంగళవారం జరిగాయి. రాష్ట్ర మంత్రులు నాదెండ్ల, అనగాని సత్యప్రసాద్, గొట్టిపాటి రవికుమార్, ఎంపీ తెన్నేటి కృష్ణ ప్రసాద్, పలువురు ప్రజా ప్రతినిధులు పోటీలను ప్రారంభించి రైతులను సన్మానించారు. విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. సబ్ జూనియర్స్ విభాగంలో 9 జతల ఎడ్లు 1,600 కిలోల బండ లాగుడు పోటీల్లో తలపడ్డాయి. ఈ సందర్భంగా సభలో మంత్రులు మాట్లాడుతూ.. భారీ స్థాయి ఒంగోలు జాతి ఎడ్ల బల ప్రదర్శన రాష్ట్రానికే ఆకర్షణగా మారిందన్నారు. ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ తండ్రి ధూళిపాళ్ల వీరయ్య చౌదరి ఆశయాలతో సంగం డెయిరీని మరో మెట్టు ఎక్కించి రైతులకు మేలు చేస్తున్నారని కొనియాడారు. వైసీపీ పాలకులు డెయిరీని నిర్వీర్యం చేసేందుకు కుట్రలు పన్ని, ఇబ్బందులకు గురిచేసినా.. జైలు జీవితం ఎదుర్కొన్నారే కానీ, దుర్మార్గాలకు లొంగలేదన్నారు. గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గళ్లా మాధవి, గుంటూరు మేయర్ కోవెలమూడి రవీంద్ర, ఇండస్ట్రియల్ కార్పొరేషన్ చైర్మన్ మంతెన రామరాజు, విజయనగరం మాజీ ఎమ్మెల్యే గంపా కృష్ణ, మహిళా కమిషన్ మాజీ చైర్‌పర్సన్ నన్నపనేని రాజకుమారి, బీజేపీ అధికార ప్రతినిధి పాతూరి నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

9 వరకే మిర్చి యార్డులో లావాదేవీలు

● సెలక్షన్ గ్రేడ్ సెక్రెటరీ చంద్రిక

గుంటూరు, మే 6 (ఆంధ్రజ్యోతి): ఎండల తీవ్రత దృష్ట్యా మిర్చి యార్డుకు ఈ నెల 12వ తేదీ నుంచి వేసవి సెలవులు ప్రకటిస్తున్నట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఎ.చంద్రిక మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. హమాలీల యూనియన్లు, చిల్లీస్ మర్చంట్స్ అసోసియేషన్ విజ్ఞప్తి మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు. యార్డులో 9వ తేదీ శుక్రవారం వరకే మిర్చి లావాదేవీలు జరుగుతాయన్నారు. శని, ఆదివారాలు యార్డుకు సెలవుదినాలని పేర్కొన్నారు. జూన్ 9 నుంచి యథావిధిగా క్రయ విక్రయాలు జరుగుతాయని తెలిపారు. రైతులు 8న సాయంత్రం నుంచి సరుకుని యార్డుకు తీసుకురావొచ్చని పేర్కొన్నారు.

డీఎస్సీ అభ్యర్థులకు ప్రత్యేక హెల్ప్‌లైన్

గుంటూరు(విద్య),మే 6(ఆంధ్రజ్యోతి): త్వరలో నిర్వహించనున్న మెగా డీఎస్సీకి హాజరయ్యే అభ్యర్థుల కోసం ప్రత్యేక హెల్ప్ లైన్ కేంద్రాన్ని పాఠశాల విద్యాశాఖ ఏర్పాటు చేసింది. జిల్లాల వారీగా ప్రత్యేక హెల్ప్‌లైన్ కేంద్రాలు ఏర్పాటు చేసి, అభ్యర్థుల సందేహాలు నివృత్తిచేయనుంది. ఉమ్మడి గుంటూరు జిల్లాకు 95733 82626, 92467 63763లో సంప్రదించాలని పేర్కొంది.

ఇంజనీరింగ్ అధికారులపై.. క్రమశిక్షణ చర్యలు

● నరుకుళ్లపాడు మేజర్ కాలువ పనుల్లో నాణ్యత లోపం ● విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సమగ్ర నివేదిక ● ప్రాథమిక ఆధారాలను గుర్తించిన జలవనరుల శాఖ

గుంటూరు, మే 6 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ ప్రాజెక్టు పరిధిలోని నరుకుళ్లపాడు మేజర్ కాల్వ పనుల్లో నాణ్యత లోపంపై జలవనరుల శాఖ ప్రాథమిక ఆధారాలను గుర్తించింది. ఇందుకు బాధ్యులైన అధికారులపై శాఖపరమైన చర్యలకు ఆదేశాలు జారీ చేసింది. తాడికొండ నియోజకవర్గం పరిధిలో జరిగిన ఈ పనుల విషయంలో పలువురు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు, డీఈఈ, ఏఈఈల పాత్ర ఉన్నట్లు అంచనాకు వచ్చింది. వీళ్లల్లో కొందరు వేరే జిల్లాల్లో ప్రస్తుతం విధులు నిర్వహిస్తుండగా.. ఒకరిద్దరు రాష్ట్ర విభజన సమయంలో తెలంగాణ క్యాడర్‌కు వెళ్లిపోయారు. అయినప్పటికీ చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం ఆదేశించింది. అవసరమైతే మేజర్ పెనాల్టీలు కూడా విధించేందుకు ప్రొసీడింగ్స్ జారీ చేసింది. ప్రభుత్వ నిర్ణయంతో ఆయా అధికారుల్లో ఆందోళన మొదలైంది.

నాగార్జున సాగర్ కుడి కాల్వ ఆధునికీకరణ పనులు ఉమ్మడి రాష్ట్రంలో పెద్దఎత్తున చేపట్టారు. కాల్వల వెడల్పు, గట్ల బలోపేతం, కొత్త రెగ్యులేటర్లు, వంతెనలు నిర్మించడం వంటి అనేక పనులు చేశారు. నరుకుళ్లపాడు మేజర్ కాల్వ పనులను తాడికొండ నియోజకవర్గంలో అప్పటి ఈఈ జి.వాసంతి (ప్రస్తుతం తెలంగాణలోని బాన్సువాడ ఇరిగేషన్ సర్కిల్ ఎస్ఈ), డీఈఈ అనురాధ(కురిచేడు సబ్ డివిజన్ మానిటరింగ్ డీఈఈ), ఏఈఈ సీహెచ్ చిన్నరాణి(ముప్పాళ్ల), డీఈఈ టీ రమేష్(పీపీ సబ్ డివిజన్ నంబరు 2 గుంటూరు), ఏఈఈ కె.రామకృష్ణ(ఎన్ఎస్‌జేసీ ఓఅండ్ఎం సెక్షన్ నకరికల్లు), ఈఈ పీవీఎస్‌వీ ప్రసాదరావు (రిటైర్డు), ఈఈ ఎంవీ కృష్ణారావు(రిటైర్డు), ఇన్‌చార్జి ఈఈ ఎంఎస్‌వీకేఎస్ రాంప్రసాదు (రిటైర్డు), ఈఈ బీఎస్‌వీ ప్రసాదరావు(రిటైర్డు) పర్యవేక్షించారు.

పనులు జరిగిన కొన్ని నెలల్లో అవి శిథిలం కావడంతో ప్రభుత్వానికి పెద్దఎత్తున ఫిర్యాదులు వెళ్లాయి. దీనిపై విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ప్రాంతీయ కార్యాలయం అధికారులు క్షేత్రస్థాయిలో విచారణ జరిపారు. పనుల్లో నాణ్యత లోపాన్ని ధ్రువీకరించి, వాటిని ఎవరెవరు పర్యవేక్షించారనే వివరాలను సేకరించి ప్రభుత్వానికి సమగ్ర నివేదిక అందజేశారు. ఈ నివేదికను జలవనరుల శాఖ క్షుణ్ణంగా పరిశీలించిన అనంతరం.. అధికారుల పర్యవేక్షణ లోపంపై ప్రాథమిక ఆధారాలున్నట్లుగా నిర్ధారించుకుంది. శాఖపరమైన చర్యలకు ఉపక్రమించింది. ఈ మేరకు మంగళవారం జలవనరుల శాఖ ఉత్తర్వులు జారీ చేసింది.

అవీ..ఇవీ..

రావినూతల రోడ్డుకు మరమ్మతులు


అంచులకు గ్రావెల్ తోలించిన కాంట్రాక్టర్

మేదరమెట్ల, మే 6 (ఆంధ్రజ్యోతి): మేదరమెట్ల నుండి రాచపూడి వరకు ఉన్న ఆర్అండ్‌బీ రోడ్డు అంచులు గుంటలు పడ్డాయి. అయినప్పటికీ, నిత్యం వేలాది వాహనాలు ఈ రోడ్డుపై ప్రయాణిస్తుంటాయి. కొరిశపాడు మండలంలోని మేజర్ పంచాయతీలను కలుపుతున్న ప్రధానమైన రోడ్డు ఇది. ఆటోలు, మోటర్ సైకిళ్ల కార్లు వేలాదిగా ప్రయాణించే ఈ రోడ్డు పూర్తిగా గుంటలు పడిపోయింది. మేదరమెట్ల రాచపూడి మధ్య 18 కిలో మీటర్లు పొడవు ఉన్న ఆర్అండ్‌బీ రోడ్డు ఇది. ఇటీవల కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రోడ్డుపై ఉన్న గుంటలకు తారుతో మరమ్మతులు చేశారు. పమిడిపాడు, రాచపూడి మధ్య కొంత దూరం పూర్తిగా తారురోడ్డు నిర్మాణం చేశారు. మేదరమెట్ల పమిడిపాడు మధ్య తారురోడ్డు మార్జిన్‌లు కోసుకుపోయి, వాహనాలు రోడ్డు మార్జిన్ దిగడానికి , ఎ క్కడానికి ఇబ్బందికరంగా మారాయి. కొన్నిసార్లు ద్విచక్రవాహనదారులు రోడ్డు మార్జిన్‌నుండి ఎక్కడానికి ప్రయత్నించి ప్రమాదానికి గురయ్యారు. ఎదైన వాహనం ఎదురుగా వచ్చినప్పుడు రోడ్డు దిగడానికి వీలు లేకుండా ఉంది. దీంతో ఆర్అండ్‌బీ అధికారులు మంగళవారం రోడ్డు మార్జిన్ గుంటలకు ఎర్రమట్టిని తోలారు. ఇది ఎక్కువ కాలం ఉండకపోయిన ప్రమాదాలు జరగకుండ కొంత వరకు కాపాడుతుంది.

14న మండల సర్వసభ్య సమావేశం

మేదరమెట్ల, 6 మే(ఆంధ్రజ్యోతి): కొరిశపాడు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం 14వ తేది మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ సాధినేని ప్రసన్నకుమారి అధ్యక్షతన జరుగుతుందని ఎంపీడీవో రాజ్యలక్ష్మి తెలిపారు. సమావేశానికి మండలంలోని సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వివిధ శాఖల అధికారులు హజరు కావాలని ఆమె తెలిపారు.

విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్న లారీ

● విరిగిన స్తంభం, నిలిచిన కరెంట్ సరఫరా


విరిగిన విద్యుత్‌స్తంభం

బల్లికురవ, మే 6(ఆంధ్రజ్యోతి): మండలం లోని అంబడిపూడి వద్ద మంగళవారం విద్యుత్ స్తంభాన్ని గ్రానైట్ లారీ ఢీ కొనడంతో విద్యుత్ స్థంభం విరిగిపడింది. దీంతో విద్యు త్ సరఫరా నిలిచిపోయిం ది. అద్దంకి వైపు నుంచి వస్తున్న గ్రానైట్ లారీ విద్యుత్ స్తంభాన్ని ఢీ కొట్టడంతో విరిగి సుమారు 200 మీటర్ల దూరం స్తంభాన్ని ఈడ్చుకు వచ్చింది. దీంతో అంబడిపూడి, గుంటుపల్లి గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. మండలంలోని బల్లికురవ-చెన్నుపల్లి మధ్య విద్యుత్ తీగ తెగిపడటంతో మంగళవారం రాత్రి రెండు గంటల పాటు మండల కేంద్రమైన బల్లికురవ లో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది.

మే చివరి వారంలో అన్నదాత సుఖీభవ

అద్దంకిటౌన్, మే 6(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం మే నెల చివరి వారంలో అ ర్హులైన రైతులందరికి అన్నదాత సుఖీభవ అందిస్తున్నట్లు మండల వ్యవసాయ అధికారి కొర్రపాటి వెంకటకృష్ణ మంగళవారం ఒక ప్రకటన ద్వారా తెలిపారు. మండలంలో 19599 మంది రైతులు వెబ్‌ల్యాండ్‌లో నమోదు అయ్యారన్నారు. రైతుసేవా కేంద్రాలలో గ్రామ వ్యవసాయ సహాయకులు ఈ డేటాను తనిఖీ చేసి చనిపోయిన వారిని, ప్రభుత్వ ఉద్యోగులను, ఆదాయ పన్ను చెల్లించేవారిని, కోర్టు కేసులలో ఉన్నవారిని, ప్రజాప్రతినిధులు, పది వేలకు పైగా పెన్షన్ తీసుకునే వారిని అనర్హులుగా గుర్తించి అర్హుల జాబితాను ప్రచురించినట్లు తెలిపారు. కావున రైతులు మీ గ్రామంలోని రైతుసేవా కేంద్రాలలో ఆధార్, పట్టాదారు పాస్ పుస్తకాలతో సంప్రదించాలని ఏవో తెలిపారు.

మూడు పంచాయతీలకు అవార్డులు

అద్దంకిటౌన్, మే 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న కుష్టు, క్షయ, ఎయిడ్స్ వ్యాధి నివరణ చర్యలుకు అనుగుణంగా జిల్లా స్థాయిలో క్షయ నిర్మూలను తీసుకున్న చర్యలకు గాను బాపట్ల జిల్లా స్థాయిలో పలు పంచాయతీలకు అవార్డులను ప్రకటించింది. మంగళవారం వాటిని బాపట్ల జిల్లాలో జరిగిన కార్యక్రమంలో అ వార్డులను అందజేశారు. అందులో భాగంగా అద్దంకి మండలంలోని గోపాలపురం పంచాయతీకి వెండి, పేరాయపాలెం, ఉప్పలపాడు పంచాయతీలకు రజిత అవార్డులను ప్రకటించగా ఆయా గ్రామ పంచాయతీ కార్యదర్శులు అవార్డులను అందుకున్నట్లు ఎంపీడీవో బత్తిన సింగయ్య తెలిపారు. అవార్డులు అందుకున్న కార్యదర్శులు ఎంపీడీవో, ఈవో ఆర్డీ ప్రసాదరావు ఇతర అధికారులు అభినందించారు.

20న దేశవ్యాప్త సమ్మె

అద్దంకిటౌన్, మే 6(ఆంధ్రజ్యోతి): కేంద్రప్రభుత్వం కార్మిక చట్టలను రద్దు చేయడం, లేబర్ కోడ్ బిల్లును తీసుకొచ్చిందని కార్మికులకు నష్టం కలిగించే ఈ చట్టలను రద్దు చేయాలని ఈ నెల 20న చేపట్టనున్న దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ నాయకులు తంగిరాల వెంకటేశ్వర్లు కోరారు. మంగళవారం స్థానిక గాజులపాలెం అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ జయసింహకు ఆశా కార్యకర్తలు సమ్మె నోటీస్‌ను అందజేశారు. కార్యక్రమంలో ఆశాలు లక్ష్మి, ధనమ్మ, మరియమ్మ, రత్నకుమారి, మస్తాన్‌బి తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన పెంచుకోండి

మేదరమెట్ల, 6 మే (ఆంధ్రజ్యోతి): రైతులు ప్రకృతి వ్యవసాయంపై అ వగాహన పెంచుకోవాలని యూనిట్ ఇన్‌చార్జి శ్రీనివాసరావు తెలిపారు. మంగళవారం పి. గుడిపాడులో రైతులకు ప్రకృతి వ్యవసాయంపై అ వగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఖరీఫ్ కార్యాచరణ అ వగాహన కల్పించారు. నవధాన్యాల సాగు ఫలితాల గురించి ప్రకృతి వ్యవసాయ స్లోకాలను రైతులకు వి వరించారు. ఈ కార్యక్రమంలో సునీత, మౌనిక, అంజలిదేవి, కరిమూన్, ప్రియాంకతో పాటు రైతులు పాల్గొన్నారు.

ఊడిన టిప్పర్ టైర్లు... తప్పిన ప్రమాదం


రోడ్డు వెంబడి అడ్డంగా నిలిచిన లారీ

అద్దంకి, మే 6(ఆంధ్రజ్యోతి): బెంగ ళూరు గ్రీన్‌ఫీల్డ్ రోడ్డు కు గ్రావెల్ తరలించే టిప్పర్ వెనుక యాక్సిల్స్ ఊడి పోయి టైర్లు ఒకదాని పై మరొకటి ఎక్కాయి. స్థానికుల కథనం మేరకు అద్దంకి పట్టణంలోని కలవకూరు రోడ్డు లో మంగళవారం రాత్రి ధర్మవరం వైపు నుండి వస్తున్న టిప్పర్ వెనుక యాక్సిల్స్ ఊడిపోయాయి. దీంతో టిప్పర్ వెనుక టైర్లు ఒకదానిపై మరొకటి చేరి రోడ్డు కు అడ్డంగా నిలిచిపోయింది. అయితే ఆ సమయంలో రోడ్డు పై ఎలాంటి వాహనాలు రాకపోవటం తో ప్రమాదం తప్పిపోయింది.

అక్రమంగా గ్రావెల్ తవ్వుతున్న వ్యక్తిపై కేసు

మార్టూరు, మే6(ఆంధ్రజ్యోతి):అక్రమంగా కొండ పోరంబోకు ప్రాంతంలో ఎర్ర గ్రావెల్ ను తవ్వుతున్న వరికల్లు ఆంజనేయులు అనే వ్యక్తిపై మంగ ళవారం స్టేషన్ లో పోలీసులు కేసు నమోదు చేశారు. మండలంలోని బొల్లా పల్లి గ్రామానికి చెందిన ఆంజనేయులు తన పొలానికి ఉత్తరాన కొండపో రంబోకు ప్రాంతంలో గ్రావెల్ ను తవ్వడానికి ప్రయత్నించారు.

వైభవంగా పోలేరమ్మ తిరునాళ్ల

భారీగా తరలివచ్చిన భక్తులు

తోటవారిపాలెం (చీరాల), మే 6 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని తోటవారిపాలెంలో వేంచేసిన పోలేరమ్మ అమ్మవారి 56వ వార్షికోత్సవ తిరునాళ్ల అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆకాశాన్ని తాకుతున్న ప్రభలు, విద్యుత్ దీపాల అలంకరణలో, వివిధ రకాల సాంఘిక నాటికలు, భక్తి పరమైన కార్యక్రమాలతో ఆలయ పరిసరాలు మార్మో గాయి. ఉదయం నుండి భక్తులు అధికసంఖ్యలో బారులుతీరి అమ్మవారికి మొక్కులు తీర్చుకున్నారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. తిరునాళ్ల సందర్భంగా కొంతమేరకు ట్రాఫిక్ సమస్య తలెత్తింది. అయితే శాంతిభద్రతలకు ఎటువంటి విఘాతం కలుగకుండా డీఎస్పీ ఎండీ.మొయిన్, సీఐ శేషగిరిరావు, ఎస్సై చంద్రశేఖర్‌లు పటిష్ట బందోబస్తు నిర్వహించారు.

చినగంజాం, మే 6(ఆంధ్రజ్యోతి) : మండలంలోని సోపిరాల గ్రామంలో వేంచేసిన పోలేరమ్మ అమ్మవారి తిరునాళ్లను మంగళవారం రాత్రి వైభవంగా నిర్వహించారు. తిరునాళ్లను పురస్కరించుకుని ఆలయ పూజారి అమ్మవారి ప్రత్యేకంగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు విశేష పూజలు జరిపి, మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు వినియోగం చేశారు. ఉదయం గ్రామంలోని మహిళలు చద్ది, వడపప్పు, పానకం, పసుపు నీళ్ల బిందెలను తీసుకొని మేళతాళలతో ఊరేగింపుగా అమ్మవారి ఆలయం వద్దకు చేరుకుని పూజలు నిర్వహించి, అమ్మవారికి జలాభిషేకం చేశారు. గ్రామంలోని పుర వీధులలో అమ్మవారి ప్రభను కనక తప్పెట్లు, మేళతాళాలతో, బాణా సంచాలతో ఊరేగింపుగా ఆలయం వద్ద తీసుకొని వెళ్లారు. ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన భారీ విద్యుత్ ప్రభల వద్ద నిర్వహించిన శ్రీలలితా రామకోటేశ్వర భజన మండలి వారు నిర్వహించిన కోలాటం, మాధవ్ ఈవెంట్స్ వారి పలు సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరించాయి. ఆలయాన్ని రంగు రంగుల విద్యుత్ దీపాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. అమ్మవారి ఆలయ ప్రాంగణంలో భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. సోపిరాల గ్రామంలో పల్లపోలు వంశీయులు, గ్రామ పెద్దలు ఆధ్వర్యంలో కార్యక్రమాలను నిర్వహించారు. తిరునాళ్లలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు.


భారీగా తరలి వచ్చిన భక్తులు





విశేష అలంకరణలో పోలేరమ్మ, ఆలయం వద్ద విద్యుత్ దీప అలంకరణ, చిన్నగంజాంలో ప్రదక్షణలు చేస్తున్న మహిళలు, ఏర్పాటు చేసిన విద్యుత్ ప్రభ

అధైర్య పడొద్దు..అండగా ఉంటాం

పొగాకు రైతులకు వ్యవసాయశాఖ ముఖ్యకార్యదర్శి రాజశేఖర్ హామీ


రైతులను వివరాలు అడిగి తెలుసుకుంటున్న రాజశేఖర్

ఉప్పుటూరు(పర్చూరు), మే 6 (ఆంధ్రజ్యోతి) :బర్లీ రైతులు అధైర్య పడాల్సిన అవసరం లేదని, ప్రభుత్వం అండగా ఉంటుందని రాష్ట్ర వ్యవసాయ శాఖ ముఖ్య కార్యదర్శి బి. రాజశేఖర్ అన్నారు. బాపట్ల జిల్లా, పర్చూరు మండలం, ఉప్పుటూరు గ్రామంలో మంగళ వారం ఆయన పొగాకు రైతులతో ముఖా ముఖి నిర్వహించారు. కార్యక్రమంలో, వ్యవసాయశాఖ కమిషనర్ ఢిల్లీరావుతో కలసి ఆయన పాల్గొన్నారు. తొలుత క్షేత్రస్థాయిలో స్థానికంగా సాగుచేసిన బర్లీ పొగాకు తోటలను అధికారులతో కలసి పరిశీలించారు. రైతుల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఉప్పుటూరు గ్రామంలోని జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు అధ్యక్షతన ఏర్పాటు చేసిన ముఖాముఖిలో పొగాకు రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి మాట్లాడుతూ బర్లీ పొగాకు రైతుల సమస్యను స్థానిక శాసన సభ్యులు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లారన్నారు. దీనిపై స్పందించిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు క్షేత్రస్థాయిలో పరిశీలించి రైతుల సమస్యలను అడిగి తెలుసుకోవాలని తమకు ఆదేశాలు ఇచ్చారన్నారు. ఆయా కంపెనీల ద్వారా కొనుగోలు చేసేవిధంగా చర్యలు తీసుకోవాలని ఇప్పటికే ముఖ్యమంత్రి స్పష్టత ఇచ్చినట్లు వెల్లడించారు. ఇప్పటికే పొగాకు కొనుగోలుకు కంట్రోల్ రూంను కమిషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశామన్నారు. పర్చూరు మండలంలోని 15గ్రామాల్లో అత్యధికంగా 25వేల ఎకరాల్లో పొగాకు సాగు చేశారన్నారు. అందులో గరిష్ఠంగా 3వేల పైచిలుకు ఉప్పుటూరులో సాగుచేయడంతో ఈ గ్రామంలోనే రైతులతో ముఖముఖి కార్యక్రమం నిర్వహించినట్లు ఢిల్లీరావు అన్నారు. కార్యక్రమంలో బాపట్ల ఆర్డీవో గ్లోరియా, తహసీల్దార్ వి.బ్రహ్మయ్య, రామాంజనేయులు, వ్యవసాయశాఖ అధికారులు పాల్గొన్నారు.

నేడు ఇన్‌చార్జ్ మంత్రి పర్యటన

చినగంజాం, మే 6(ఆంధ్రజ్యోతి) : మండలంలోని పలు గ్రామాల్లో జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి, సమాచార పౌరసంబంధాలు, గృహ నిర్మాణ శాఖామాత్యులు కొలుసు పార్థసారిధి, పర్చూరు శాసనసభ్యులు ఏలూరి సాంబశివ రావులు బుధవారం పలు శంకుస్థాపన, ప్రారంభోత్సవ కార్యక్రమాల్లో పాల్గొన్నట్లు టీడీపీ మండల అధ్యక్షులు పొద వీరయ్య మంగళవారం తెలిపారు. మంత్రి, ఎమ్మెల్యేల పర్యటన వివరాలు ఇలా బుధవారం ఉదయం 10.30గంటలకు ఎమ్మెల్యే ఏలూరి క్యాంపు కార్యాలయంలో సీఎం ఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ అనంతరం మధ్యాహ్నం 12 గంటలకు సోపిరాల డొంక బజారులో రూ.26.50లక్షల రూపాలయలతో నూతనంగా నిర్మించిన సిమెంట్ రోడ్డు ప్రారంభోత్సవం, 12.30 గంటలకు స్థానిక కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయంలో కోటిన్నర రూపాయిల వ్యయంతో నిర్మించనున్న అదనపు తరగతి గదులకు భూమిపూజ, రూ.36లక్షల రూపాయలతో నూతనంగా నిర్మించిన ప్రహరీగోడ ప్రారంభోత్సవం, 1గంటకు చినగంజాం గ్రామంలో రూ.6లక్షల రూపాయిలతో నూతనంగా నిర్మించిన సిమెంట్ రోడ్డు ప్రారంభోత్సవం, మధ్యాహ్నం 1.30గంటకు చినగంజాం గ్రామ పంచాయతీ పరిధిలోని రామకోటేశ్వరకాలనీలో పిడుగు పాటుతో మృతిచెందిన గడ్డం బ్రహ్మయ్య కుటుంబ సభ్యులను పరామర్శించి, ఆర్థిక సాయం అందజేస్తారన్నారు. 2గంటలకు సోపిరాలలో మధ్యాహ్న భోజనం అనంతరం 2.30గంటలకు నీలాయపాలెంలో బస్సు ప్రమాద బాధితులను పరామర్శించి, ఆర్థిక సాయం అందజేయనున్నట్లు తెలిపారు.

ఏబీవీపీ నిరసనలో స్వల్ప ఉద్రిక్తత


విద్యాశాఖమంత్రి లోకేష్ దిష్టిబొమ్మ దహనాన్ని అడ్డుకుంటున్న పోలీసులు

ఒంగోలు కలెక్టరేట్, మే 6 (ఆంధ్రజ్యోతి) : అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) ఒంగోలు శాఖ ఆధ్వర్యంలో మంగళవారం ఒంగోలులో నిర్వహించిన నిరసన స్వల్ప ఉద్రిక్తతకు దారితీసింది. జీవో నంబర్ 77ను రద్దుచేయాలని డిమాండ్ చేస్తూ స్థానిక లాయర్‌పేటలోని ప్రకాశం పంతులు విగ్రహం వద్ద విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ దిష్టిబొమ్మను దహనం చేసేందుకు ఏబీవీపీ కార్యకర్తలు ప్రయత్నించారు. దీన్ని పోలీసులు అడ్డుకు న్నారు. దీంతో తోపులాట జరిగింది. ఈ సందర్భంగా ఏబీవీపీ నెల్లూరు విభాగ్ కన్వీనర్ రాజశేఖర్ మాట్లాడుతూ 77 జీవోను రద్దు చేయకుండానే ఈనెల 7న ఐసెట్ పరీక్షలు నిర్వహించడం తగదన్నారు. గత ఎన్నికలకు ముందు లోకేష్ ఇచ్చిన హామీ మేరకు ఆ ఉత్తర్వులను రద్దుచేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా కన్వీనర్ అంకిరెడ్డి పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం : ఎస్పీ

● పోలీసుల పిల్లలకు సమ్మర్ క్యాంప్ ప్రారంభం



టగ్‌ఆఫ్‌వార్ ఆటల పోటీని ప్రారంభిస్తున్న ఎస్పీ

ఒంగోలు క్రైం, మే6(ఆంధ్రజ్యోతి): క్రీడలతో మానసిక ఉల్లాసంతో పాటు శరీరక దారుఢ్యం పెంపొదిస్తాయని ఎస్పీ ఏఆర్.దామోదర్ పేర్కొ న్నారు. మంగళవారం ఒంగోలులోని జిల్లా పోలీ సు కార్యాలయం ఆవరణలోని క్రీడా మైదానం లో పిల్లలకు స్పోర్ట్స్ అండ్ గేమ్స్‌లో సమ్మర్ కోచింగ్ క్యాంప్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ క్రీడలతో చి న్నారుల్లో పోటీతత్వం ఏర్పడుతుందన్నారు. త ల్లిదండ్రులు తమ పిల్లలకు ఇష్టమైన క్రీడలలో ప్రోత్సహించాలని అన్నారు. కోరారు. రోజులు పా టు జరిగే ఈ క్యాంప్‌లో పోలీసులు తమ పిల్ల లను చేర్పించాలని కోరారు. క్రీడలతో క్రమశిక్ష ణ, నాయకత్వ లక్షణాలు పెరుగుతాయని చె ప్పారు. అదేవిధంగా ఓటమిని స్వీకరించే గు ణం వంటి ఎన్నో విషయాలు నేర్చుకుంటారని తెలిపారు. కాగా సమ్మర్ క్యాంప్‌లో భాగంగా ఫుట్‌బాల్, టగ్‌ఆఫ్‌వార్, షటిల్ బాడ్మింటన్, ర న్నింగ్ యోగా వంటి అంశాలపై హెడ్ కానిస్టేబుల్ రాజేంద్ర, జాతీయ క్రీడాకారులు శి క్షణ ఇవ్వనున్నారు. కార్యక్రమంలో ఏఎస్పీ కె. నాగేశ్వరరావు, ఏఆర్ ఏఎస్పీ అశోక్‌బాబు, ఏఆర్ డీఎస్పీ శ్రీనివాసరావు, ఎస్బీ ఇన్‌స్పెక్టర్ రాఘవేంద్ర, ఆర్ఐలు రమణారెడ్డి, సీతారామి రెడ్డి పాల్గొన్నారు.

టెన్నిస్ కోర్టు ప్రారంభం

పోలీసు మైదానంలో నవీకరించిన టెన్నిస్ కోర్టును ఎస్పీ దామోదర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతే నిత్యం మా నసిక ఒత్తిడికి గురయ్యే పోలీసు సిబ్బందికి ఇ ది ఎంతో ఉపయోగపడుతుందన్నారు.

వెల్లంపల్లిలో ఆగి సాగిన పొగాకు వేలం

● భారీగా తిరస్కరణకు గురైన బేళ్లు

మద్దిపాడు, మే 6(ఆంధ్రజ్యోతి): వెల్లంపల్లి పొగాకు వేలం కేంద్రంలో మంగళవారం వేలం ఆగి సాగింది. వ్యాపారులు సిండికేట్ కావడంతో పాటు రైతులు తీసుకొచ్చిన పొగాకు బేళ్లను తిరస్కరించారు. దీంతో ఆగ్రహించిన రైతులు వేలంను గంటపాటు నిలుపుదల చేశారు. మారెళ్ల క్లస్టర్ రైతులు 572 బేళ్లు తీసుకు రాగా దానిలో 25 శాతం బేళ్లను తిరస్కరించడంతో వేలం కేంద్రం కార్యనిర్వాహణాధికారి కోవి రామకృష్ణ రైతులతో మాట్లాడారు. దీంతో 135 బేళ్లు రైతులు వెనక్కి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ పొగాకు నాణ్యతగా లేకపోవడంతో వ్యాపారులు తిరస్కరించారని చె ప్పారు. పొగాకు కిలో గరిష్ఠ ధర రూ.280, కనిష్ఠ ధర రూ.230 పలికినట్లు తెలిపారు. కార్యక్రమంలో రైతు సంఘ అధ్యక్షులు అబ్బూరి శేషగిరిరావు, నా రిపెద్ది వరహాలుచౌదరి, మండవ గోవిందరాజులు, బోయపాటి వెంకయ్యచౌ దరి, మండవ శ్రీరామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.

12న డీఆర్‌సీ సమావేశం

ఒంగోలు, మే 6 (ఆంధ్రజ్యోతి) : అత్యంత కీలకమైన జిల్లా సమీక్ష మండలి (డీఆర్సీ) సమావేశం ఈ నెల 12న జరగనుంది. ఆ రోజున ఉదయం 11 గంటలకు ప్రకాశం భవనంలోని పీజీఆర్ఎస్ హాలులో దీన్ని నిర్వహించనున్నారు. వాస్తవానికి గతనెల 23న డీఆర్సీ జరగాల్సి ఉంది. అయితే 22వతేదీ రాత్రి జిల్లాకు చెందిన టీడీపీ ముఖ్యనేత, మాజీ ఎంపీపీ ముప్పవరపు వీరయ్య చౌదరి దారుణహత్యకు గురయ్యారు. ఆ మరుసటి రోజున అమ్మనబ్రోలులో ఆయన అంత్యక్రియలు జరగ్గా, నివాళులర్పించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు వచ్చారు. దీంతో 23వ తేదీ జరగాల్సిన డీఆర్సీ సమావేశాన్ని వాయిదా వేశారు. తాజాగా ఈనెల 12న నిర్వహించాలని ఇన్‌చార్జి మంత్రి నిర్ణయించారు. ఆ మేరకు అధికారులకు సమాచారం ఇచ్చారు. కీలక అంశాలపై సమావేశంలో చర్చించనున్నారు. ప్రధానంగా జిల్లాలో ప్రస్తుతం జరుగుతున్న ఉపాధి హామీ పథకం పనుల పురోగతి, గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో వేసవిలో తాగునీటి సమస్య పరిష్కారం, విద్యుత్ రంగంలో పీఎం సూర్యఘర్ పథకం తీరు, రాష్ట్రప్రభుత్వం అత్యంత ప్రధాన్యతగా భావిస్తున్న ప్రజావినతుల పరిష్కారం తదితర అంశాలపై చర్చించేలా అజెండాను రూపొందిస్తున్నట్లు తెలిసింది.

పుస్తక పఠనంతో విజ్ఞానం


మాట్లాడుతున్న హెచ్ఎం రత్నకుమారి

చినగంజాం, మే 6(ఆంధ్రజ్యోతి) : పుస్తక పఠనంతో విద్యార్థులు విజ్ఞానాన్ని పెంపొందించుకోవచ్చునని చినగంజాం జడ్పీ పాఠశాల హెచ్.ఎం. డి.రత్నకుమారి అన్నారు. స్థానికశాక గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరంలో శిక్షణ తరగతుల్లో భాగంగా మంగళవారం వివిధ అంశాలపై ఇచ్చిన శిక్షణలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. పుస్తక పఠనం దాని అవశ్యకత, పుస్తకాలు చదవడం వలన కలిగే ప్రయోజనాలను గురించి హెచ్.ఎం వివరించారు. తదనంతరం విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. బ్రైట్ మైండ్స్ ఫర్ చిల్డ్రన్ అనే అంశంపై శిక్షణ తీసుకున్న విద్యార్థి తాళ్లూరి తనీష్‌రామ్ కళ్లకు గంతలు కట్టుకొని వస్తువు రంగుని గుర్తుపట్టే సృజనాత్మక కృత్యాన్ని ప్రదర్శించినట్లు గ్రంథపాలకులు మోహనలక్ష్మీనరసింహాచార్యులు తెలిపారు. కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్లు ఎస్.నరసింహారావు, వై.రామాంజనేయులు, పల్లపోలు శ్రీనివాసరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

పౌష్టికాహార ప్రయోజనాలపై అవగాహన


అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్

అద్దంకిటౌన్, మే 6 (ఆంధ్రజ్యోతి): పౌ ష్టి కా హా ర ం తీసుకోవడం వలన కలిగే ప్రయోజనాల పై ప్రతి కిశోర బాలిక అవగాహన కలిగి ఉండాలి ఐసీడీఎస్ సూపర్ వైజర్ ఇందిర అన్నారు. మంగళ వారం కలవకూరు సెక్టర్ పరిధిలోని అన్ని గ్రామ సచివాలయాలలో కిశోర వికాసం కార్యక్రమంలో భాగంగా కిశోర బాలికలకు పోషకాహారం, రక్తహీనత, పరిశుభ్రత పై అవగాహన కలించారు. వ్యక్తిగత పరిశుభ్రత, రక్తహీనతకు గురికాకుండా తీసుకోవాల్సిన పోషకాహారం గురించి తెలియజేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

స్టడీ అవర్లను పరిశీలించిన డిప్యూటీ డీఈవో

చినగంజాం, మే 6(ఆంధ్రజ్యోతి) : చినగంజాం, రాజుబంగారుపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2024-25 విద్యా సంవత్సరంలో జరిగిన పదో తరగతి పరీక్షా ఫలితాల్లో ఫెయిల్ అయిన విద్యార్థులకు నిర్వహిస్తున్న స్టడీ అవర్లను పర్చూరు డిప్యూటీ డీఈవో గంగాధర్ మంగళవారం పరిశీలించారు. విద్యార్థుల సామర్థ్యాలను ఆయన పరిశీలించి, ఉపాధ్యాయులకు పలు సూచనలు అందజేశారు. విద్యార్థులు శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకొని ఉత్తీర్ణత సాధించాలని అన్నారు. తదనంతరం చినగంజాం జడ్పీ పాఠశాలలోని స్టాక్ రూములోని జేవీకే కిట్ల నిల్వలను డిప్యూటీ డీఈవో పరిశీలించారు. విద్యార్థినీ విద్యార్థులకు వచ్చిన బెల్టులను నాణ్యతాపరంగా ఎలా ఉన్నది పరిశీలించారు. కార్యక్రమంలో పాఠశాలల హెచ్.ఎంలు డి.రత్నకుమారి, రంగని శ్రీనివాసరెడ్డి, ఉపాధ్యాయులు ఎస్.నరసింహారావు, ఎన్.సూర్యనారాయణ, పి.బ్రహ్మయ్య, ఎంఐఎస్ కోఆర్డినేటర్ ఎం.మురళి, సీఆర్పీ సీ.హెచ్.సురేంద్రకుమార్, ఎం.ఆశిష్‌కుమార్‌లు పాల్గొన్నారు.

స్వతంత్రంగానే ఐఎల్‌టీడీ యూనియన్ వర్కర్స్

చీరాల, మే 6 (ఆంధ్రజ్యోతి) : ఇకపై ఏపీ ఫెడరేషన్ ఆఫ్ ఐఎల్‌టీడీ కంపెనీ వర్కర్స్ యూనియన్ ప్రతినిధులు స్వతంత్రంగా ముందుకు సాగనున్నారు. గతంలో సీఐటీయూకు అనుబంధంగా ఉండి వివిధ కారణాతో వేరయింది. ఈక్రమంలో నూతన ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు చిప్పలపల్లి శివరాజు ఆధ్వర్యంలో కమిటి ప్రతినిధులు కంపెనీ మేనేజర్ శ్యాంసుందర్‌కు అందుకు సంబంధించిన పత్రాన్ని అందజేశారు. ఇటీవల ఈపూరుపాలెం ఆటోనగర్‌లో మహాసభలు జరిగిన తరుణంలో దీనిపై ఒప్పందం జరిగినట్లు ప్రతినిధులు తెలిపారు. రాష్ట్ర అధ్యక్షులతో పాటు రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా గంట సుధీర్, కోశాధికారిగా పఠాన్ నాగుల్, మరో 22 మందితో నూతన కమిటీ ఏర్పడినట్లు ప్రతినిధులు తెలిపారు.

అనుచిత వ్యాఖ్యలపై నిరసన

పంగులూరు, మే 6(ఆంధ్రజ్యోతి): పీహెచ్‌సీలల్లో విధులు నిర్వహించే ఎఎన్ఎంలు, సూపర్ వైజర్లు, ఆశా వర్కర్ల పట్ల ఎం.ఎల్.పి.హెచ్. (సిహెచ్.ఓ.)లు సోషల్ మీడియా వేదికగా చేసిన అనుచిత వ్యాఖ్యల చేయడంపై వారు నిరసన వ్యక్తం చేశారు. ఏఎన్ఎంలు సూపర్ వైజర్లకు వృత్తిపరంగా ఏబీసీడీలు కూడా తెలియవని, జీతాలు మాత్రం పొందుతున్నారని సోషల్ మీడియా వేదికగా అనుచిత వ్యాఖ్యలు చేశారు. దీనిపై పంగులూరు పి.హెచ్.సి. ఎదుట మంగళవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. అనుచిత వ్యాఖ్యలు చేసిన ఎంఎల్‌పీహెచ్ఎస్.లపై చర్యలు చేపట్టాలని కోరుతూ వైద్యాధికారిణి డాక్టర్ బాల రాజేశ్వరికి వినతి పత్రం అందజేశారు.

అజీజ్ సాహిత్య సేవలు చిరస్మరణీయం

ఒంగోలు(కల్చరల్), మే 6(ఆంధ్రజ్యోతి): ఆధ్యాత్మిక, సాహిత్య రంగాలలో అజీజ్ అహమ్మద్ అందించిన సేవలు చిరస్మరణీయమని పలువురు కళాకా రులు పేర్కొన్నారు. ఇటీవల మరణించిన అజీజ్ సంస్మరణ సభ శ్రీనాగినేని నరసింహారావు మెమోరియల్ ఆర్ట్స్ ఆధ్వర్యంలో మంగళవారం సాయంత్రం స్థానిక సీవీఎన్ రీడింగ్ రూములో జరిగింది. ముందుగా అజీజ్ చిత్రపటా నికి కళాకారులు పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం జరిగిన సంస్థ అధ్యక్షుడు మిడసల మల్లిఖార్జునరావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో మిరియాల వెలుగొండయ్య, సీవీఎన్ రీడింగ్ రూము అధ్యక్ష, కార్యదర్శులు గురునాథరావు, రాధాకృష్ణ, కె.రాములు, కుర్రా ప్రసాద్‌బాబు, నితిన్‌రెడ్డి, వీరప్రతాప్, కరేటి కిరణ్‌బాబు, ఎస్.కోటేశ్వరరావు, సాంబశివరావు, ఎప్రసాద్, మహబూబ్‌జాన్, షేక్ షబ్బీర్, మన్సూర్ పాల్గొన్నారు.

రోటరీ ఆధ్వర్యంలో ముప్పాళ్లలో నేత్రదానం

ఇంకొల్లు,మే 6,(ఆంధ్రజ్యోతి) : ప్రకాశం జిల్లా నాగులుప్పలపాడు మండలం ముప్పాళ్ల గ్రామానికి చెందిన కల్లూరి ఏసుబాబు మంగళవారం మృతిచెందగా ఇంకొల్లు రోటరీక్లబ్ ఆధ్వర్యంలో నేత్రదానం చేశారు. వారి బంధువులు సహకారంతో గుంటూరు శంకర కంటి ఆసుపత్రి వైద్యులు రోటరీ అవయవదాన కమిటీ ఆధ్వర్యంలో నేత్రాలను సేకరించారు. కార్యక్రమంలో రోటరీ అవయవదాన కమిటీ సభ్యులు జెట్టి స్వామి, రామ్మోహనరావు, రోటరీ సభ్యులు పాల్గొన్నారు.

రైతు ఉత్పత్తిదారుల సంఘాలను బలోపేతం చేయాలి

ఇంకొల్లు, మే6,(ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని రైతుఉత్పత్తిదారుల సంఘాలను బలోపేతం చేయాలని ఏపీఎం అనూరాధ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం రైతు ఉత్పత్తిదారుల సంఘం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీవో బుల్లియ్య మాట్లాడుతూ రైతు సంఘాలకు ప్రభుత్వం అందజేస్తున్న రాయితీలను, వడ్డీలేని రుణాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. రాయితీలో షేడ్‌నెట్‌లు పొందడం, ఉద్యాన పంటలు పండించే వారికి ప్రోత్సహించాలని కోరారు. కార్యక్రమంలో బోర్డు ఆఫ్ డైరెక్టర్లు, సీసీలు పాల్గొన్నారు.

కాలుష్యం కోరల్లో మున్సిపాలిటీ

- డివైడర్ల మధ్య కనిపించని పచ్చదనం
- నెరవేరని లక్ష్యం, అధికారుల్లో నిర్లక్ష్యం
- దృష్టిసారించని పాలకవర్గాలు




డివైడర్‌పై అరకొరగా ఉన్న మొక్కలు, పచ్చదనం లేని చీరాల పట్టణం వ్యూ

చీరాల, మే 6 (ఆంధ్రజ్యోతి) : మున్సిపాలిటీని కాలుష్యంభూతం ఆవహివిస్తోంది. దీన్ని నివారించేందుకు ప్రభుత్వమైనా మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని, నిత్యం హెచ్చరిస్తూనే ఉన్నాయి. అలాగే అందుకు సంబంధించి వ్యయ ప్రయాసలకోర్చి అనేక అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నా... ఆచరణలో మాత్రం అమలుకావడం లేదు. ఏటా వన మహోత్సవం కార్యక్రమం నిర్వహించి లక్షలు మొక్కలు నాటుతున్నట్లు అధికారులు లెక్కల్లో ఉన్నాయి. కానీ క్షేత్రస్థాయిలో వాస్తవాలు భిన్నంగా ఉంటున్నాయి.

చీరాల పురపాలక సంఘం పరిధిలో 33 వార్డులు ఉన్నాయి. అందులో సుమారు రెండు లక్షలు వరకు జనాభా ఉండగా, సుమారు 20 కిలోమీటర్లు మేర డివైడర్‌లు ఉన్నాయి. అయితే అందులో మొక్కలు మాత్రం అంతంతమాత్రంగానే ఉన్నాయి. మున్సిపాలిటీకి ఈ శాపం గత పభుత్వం పాపంగా చెప్పవచ్చు. గతంలో విధుల్లో ఉన్న అధికారులు నిర్లక్ష్యం కారణంగా పర్యవేక్షణ లోపించింది. దీంతో మొక్కలు అరకొరగా మార్గాల్లో దర్శనమిస్తున్నాయి. దీంతో కాలుష్యం తాండవిస్తోంది. కనీసం ఈ ప్రభుత్వమైనా మున్సిపాలిటీపై దృష్టి సారించాలని ప్రజలు కోరుకుంటున్నారు.

వెలుగు కార్యాలయంగా మారని పేరు



బల్లికురవ మండల కార్యాలయంలో మారని పేరు

బల్లికురవ, మే 6 (ఆంధ్రజ్యోతి) : గత వైసీపీ ప్రభుత్వం ప్రభుత్వ కార్యాలయాలకు ఇష్టానుసారంగా తమ సొంత పేర్లను కార్యాలయాలకు పెట్టుకుంది. టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టగానే గతంలో ఉన్న పేర్లను తొలగిస్తూ, ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. గతంలో పొదుపు సంఘాల మహిళలు వినియోగించే మండల సమాఖ్య కార్యాలయానికి వైసీపీ ప్రభుత్వం వైఎస్ఆర్ క్రాంతి పథం అంటూ పేరును ఏర్పాటు చేసింది. కూటమి ప్రభుత్వం ఈ పేరుకు తొలగిస్తూ, వెలుగు కార్యాలయంగా మార్పు చేస్తూ ఉత్తర్వులు ఇచ్చింది. అయితే బల్లికురవలో మాత్రం ప్రభుత్వం వచ్చి పది నెలలు గడుస్తున్నప్పటికీ, ఇంకా వైఎస్ఆర్ క్రాంతిపథంగానే వెలుగు కార్యాలయం పనిచేస్తోంది. వైఎస్ఆర్ పేరు ఇంకా తొలగించకపోవడంపై సర్వత్ర విమర్శలు వినిపిస్తున్నాయి. తక్షణమే పేరును సరిచేయాలని పలువురు మహిళలు పేర్కొంటున్నారు.

ఉపాధి కూలీలు బీమా పథకంలో నమోదు చేయించుకోవాలి

ఎంపీడీవో కుసుమకుమారి

బల్లికురవ, మే 6 (ఆంధ్రజ్యోతి) : ఉపాధి హామీ పథకంలో గ్రామాలలో పనులు చేస్తున్న కూలీలు అందరు బీమా పథకంలో పేరు నమోదు కావాలని ఎంపీడీవో కె. కుసుమ కుమారి కోరారు. మంగళవారం మండలంలోని కొణిదెన గ్రామంలో ఉపాధి హామీ పథకం కూలీలకు ఎంపీడీవో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అమె మాట్లాడుతూ వేసవి ఎండల వలన పలు చోట్ల కూలీలు అనారోగ్యం బారిన పడి పలువురు మృతి చెందుతున్నారన్నారు. కూలీలకు బీమాసౌకర్యం ఉందని తెలిపారు. ప్రధాన మంత్రి బీమాయోజన, ప్రధాన మంత్రి జీవనజ్యోతి బీమా పథకాలను కూలీలు ఉపయోగించుకోవాలన్నారు. ప్రతి కూలీ రూ.20, రూ.436లను బ్యాంకులలో చెల్లిస్తే ఎవరైన కూలీలు ప్రమాదవశాత్తు మరణిస్తే వారికి రెండు లక్షల భీమా నగదు అందుతుందన్నారు. ఉపాధి హామీ పథకం సిబ్బంది కూడా కూలీలకు బీమా పథకాలపై అవగాహన కల్పించాలని సూచించారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయంలో అన్ని గ్రామాల ఉపాధి పథకం క్షేత్రసహాయకులు, సిబ్బందితో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. జాబుకార్డులు కలిగి ఉన్న కూలీలు అందరిని బీమా పథకంలో నమోదు చేయించే కార్యక్రమం వెంటనే చేపట్టాలని ఎంపీడీవో సూచించారు.

12న సర్వసభ్య సమావేశం

అద్దంకిటౌన్, మే 6(ఆంధ్రజ్యోతి): అద్దంకి మండల ప్రజాపరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం ఈ నెల 12న ఉదయం 11 గంటలకు మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో మండల అధ్యక్షురాలి అధ్యక్షతన నిర్వహించనున్నట్లు ఎంపీడీవో బత్తిన సింగయ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా శాఖలపై సమీక్ష నిర్వహించనున్నట్లు సభ్యులు, శాశ్వత ఆహ్వానితులు, మండల స్థాయి అధికారులు అందరు తప్పక హజరు కావాలన్నారు.

రోటరీ ఆధ్వర్యంలో వీల్ చైర్స్ బహూకరణ



వీల్‌చైర్స్ అందజేస్తున్న క్లబ్ ప్రతినిధులు

పంగులూరు, మే 6 (ఆంధ్రజ్యోతి): మండ ల కేంద్రమైన పంగు లూరులో రోటరీక్లబ్ ఆఫ్ పంగులూరు వారి ఆధ్వర్యంలో మంగళ వారం ఇరువురు వ్యక్తులకు వీల్‌చైర్స్ అందజేశారు. పంగు లూరు ముస్లిం కాలనీకి చెందిన పఠాన్ ఇమామ్, కొండమంజులూరు గ్రామానికి చెందిన భానుప్రసాద్‌లకు వీల్‌చైర్స్ బహూకరించారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు షేక్ కాలేషావలి, విశ్రాంత ప్రొఫెసర్ బత్తుల వీరనారాయణ, మెడికల్ క్యాంప్ ఇన్‌చార్జ్ వీరరాఘవయ్య, విశ్రాంత ఆర్మీ సైంటిస్ట్ రాయిణి రామారావు క్లబ్ ప్రతినిధులు ఐ.సుబ్బారావు, గుర్రం ఆంజనేయులు, జాగర్లమూడి సుబ్బారావు, పోతిన ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

గుంటుపల్లి సర్పంచ్‌కి కృష్ణకుమారి ప్రశంసాపత్రం

బల్లికురవ, మే 6 (ఆంధ్రజ్యోతి): క్షయవ్యాధి నిర్మూలనకు అంకితభావంతో పనిచేసినందుకు గాను మండలంలోని గుంటుపల్లి గ్రామసర్పంచ్ మాదాల కృష్ణకుమారికి జిల్లా అధికారులు మంగళవారం ప్రశంసపత్రం అందజేసి ఘనంగా సత్కరించారు. బాపట్ల జిల్లా కేంద్రంలో డీపీవో ప్రభాకరరావు, టీబీ జిల్లా అధికారి షేక్ మహ్మద్‌సాధిక్‌రావుల చేతుల మీదుగా టీబీ ముక్త్ పంచాయతీ 2024- 25 సంవత్సరాలకు గాను ఉత్తమ పంచాయతీ సర్పంచ్ ఎంపికైన మాదాల కృష్ణకుమారికి ప్రశంసపత్రం అందజేశారు. సమాజంలో టీబీ అనే వ్యాధి లేకుండా ప్రతి ఒక్కరు ప్రత్యేక కృషి చేయాలని ఈ సందర్భంగా వారు పేర్కొన్నారు. గుంటుపల్లి పంచాయతీ కార్యదర్శి నూర్ అహ్మద్‌ను అధికారులు ప్రశంసించారు.

ఘనంగా వీరబ్రహ్మేంద్ర స్వామి ఇరుముడులు



గ్రామోత్సవంలో పాల్గొన్న దీక్షదారులు

బల్లికురవ, మే 6 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చినఅంబడిపూడి గ్రామంలో మంగళవారం వీరబ్రహ్మేంద్రస్వామి వారి ఇరుముడుల మహోత్సవ కార్యక్రమం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అంబడిపూడి గ్రామంలో ఏటా కొందరు భక్తులు వీర బ్రహ్మేంద్ర స్వామి మాలధారణ దీక్ష 40 రోజుల పాటు పూర్తి చేసి బ్రహ్మంగారి మఠానికి వెళ్లి ఇరుముడులు చెల్లించి వస్తుంటారు. ఈ ఏడాది కూడా గ్రామంలోని కొందరు బ్రహ్మంగారి మాలదారణ చేసి బ్రహ్మంగారి మఠానికి బయలుదేరారు. ఈ సందర్భంగా గ్రామంలో గ్రామోత్సవం నిర్వహించి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

ప్రజల సమస్యలపై నిర్లక్ష్యాన్ని ఉపేక్షించం



అర్జీలు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు

మార్టూరు, మే6 (ఆంధ్రజ్యోతి): రైతుల భూసమస్యల పరిష్కారానికి అధికారులు కృషి చేయాలని, నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు అన్నారు. ప్రభుత్వ పథకాలు ప్రజలందరికీ అందాలన్నారు. మంగళవారం ఆయన తన క్యాంపు కార్యాలయంలో ఆయన ప్రజల నుండి వివిధ సమస్యలపై అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఏలూరి మాట్లాడుతూ గ్రామాలలో అభివృద్ధిపనులకు అధికారులు ఒక ప్రణాళికను తయారుచేయాలన్నారు. గ్రామాలలో సిమెంటురోడ్ల నిర్మాణాలను వేగవంతంగా, నాణ్యతాపరంగా పూర్తి చేయాలన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి తొలి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. యువత నైపుణ్యాలను పెంచుకోవడం ద్వారా మెరుగైన ఉపాధిని పొందుతారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం 20 లక్షల మందికి ఉద్యోగాల కల్పనకు ప్రణాళికను సిద్ధం చేస్తున్నదన్నారు. రాజధాని అమరావతిలో ముఖ్యమంత్రి చంద్రబాబు సారధ్యంలో అభివృద్ధి పనులు వేగవంతంగా జరుగుతున్నాయన్నారు. రాష్ట్రంలోని ఎంతో మందికి అమరావతిలో ఉపాధి లభిస్తుందన్నారు. ప్రస్తుతం ఎంతోమంది కార్మికులకు అమరావతిలో చేతినిండా పనిదొరుకుతుందన్నారు. వ్యాపార, వాణిజ్య పరంగానే గాకుండా, విద్య, ఆరోగ్యం, యువతకు ఉపాధి పరంగా అమరావతిని దేశంలోనే గుర్తింపు ఉన్న రాజధానిగా చంద్రబాబు తీర్చిదిద్దుతారన్నారు. మరో మూడేళ్లలో అమరావతిలో అద్భుత నిర్మాణాలను మనం చూస్తామన్నారు. ఈ కార్యక్రమంలో తాటి నాగేశ్వరరావు, కామినేని జనార్దన్, మిన్నెకంటి రవికుమార్, కామేపల్లి హరిబాబు, గ్రానైట్ అసోసియేషన్ అధ్యక్షులు పత్తిపాటి సురేష్, ఇంటూరి ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

శింగరకొండ మారుతీభవన్‌కు కొత్త హంగులు

- దాతల సహకారంలో గదులలో వసతుల కల్పన
- అద్దె తగ్గించడంతో పెరిగిన డిమాండ్



విరాళం చెక్కును అందజేస్తున్న నాగసూరి హనుమంత్‌ప్రసాద్

అద్దంకి,మే6(ఆంధ్రజ్యోతి): శింగరకొండలో మారుతీ భవన్‌లో బస చేసే భక్తుల సంఖ్య పెరిగింది. దాతల సహకారంతో మారుతీ భవన్‌లో గదులలో ఏసీలు, డబుల్‌కాట్ మంచం, బెడ్, వేడినీటి కోసం గ్రీజర్ తదితర వసతులు కల్పించారు. మొత్తం 30 గదులు ఉండగా ఇప్పటికే 25 గదులకు సంబంధించి దాతల సహకారంతో అభివృద్ధి చేశారు. ఆయా గదులపై దాతల పేర్లు కూడా ఏర్పాటు చేస్తున్నారు. గతంలో మారుతీభవన్‌లో గదులు తీసుకునే భక్తులసంఖ్య అతి తక్కువగా ఉండేది. అత్యధిక శాతం ఆయా సామాజిక వర్గాల అన్నదాన సత్రాలలో గదులు తీసుకునే భక్తులే ఎక్కువగా ఉండే వారు. దీనికి కారణం మారుతీ భవన్‌లో గదుల అద్దె ఎక్కువగా ఉండడంతో పాటు వసతులు లేకపోవడమే. గతంలో రోజు కు ఏసీ గది అద్దె వెయ్యి రూపాయలు, నాన్ ఏసీ 500 రూపాయలుగా ఉండేది. ప్రస్తుతం ఏసీ గది రూ.500 నాన్ ఏసీ రూ.300లకు తగ్గించారు. మహాకుంభాభిషేకముకు గదులు అవసరం కావడం, భవిష్యత్తులో భక్తులు కు అన్ని వసతులు కల్పించాలన్న ఉద్దేశ్యంతో ఈవో తిమ్మానాయుడు ప్రత్యేక దృష్టిసారించి దాతల సహకారంలో అన్ని గదులలో వసతుల కల్పన ప్రారంభించారు. నెల రోజుల వ్యవధిలోనే 25 మంది దాతలు ముందుకు వచ్చి ఆయా గదులలో వసతుల కల్పనకు విరాళాలు అందజేశారు.

విరాళాలు అందజేత

మారుతీభవన్‌లో గదులు ఆధునీకరణకు మంగళవారం అద్దంకికి చెందిన మారుతీ ఫ్యాషన్స్ ప్రొప్రైటర్ షేక్ రఫీ, సైదాబీ దంపతులు, మేడగం అంజిరెడ్డి, వెంకటరాజ్యం దంపతులు, నాగసూరి హనుమత్‌ప్రసాద్, పుష్పావతి దంపతులు విరాళాలను తిమ్మానాయుడుకు అందజేశారు.

రాతి ముఖమండపానికి లక్ష రూపాయల విరాళం

అద్దంకి,మే6(ఆంధ్రజ్యోతి): శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవాలయం రాతి ముఖమండపం నిర్మాణానికి ధర్మవరపు భాస్కరరావు, సుజాతల తరపున మామ అద్దంకికి చెందిన రిటైర్డ్ దేవాదాయశాఖ అధికారి మేకా వెంకటేశ్వర్లు మంగళవారం 1,01,116 రూపాయలను ఈఓ తిమ్మానాయుడుకు అందజేశారు.

మహాకుంభాభిషేకానికి కావేరి నది నీరు



శ్రీరంగం వద్ద కావేరి నదిలో నీటిని సేకరిస్తున్న అర్చకులు సత్యం

అద్దంకి : శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవాలయంలో 19వ తేది జరిగే మహాకుంభాభిషేకానికి దేశంలోని ఐదు నదుల నుంచి పవిత్ర జలాలను తీసుకొని వచ్చే క్రమంలో మంగళవారం శ్రీరంగం వద్ద కావేరీ నది జలాలను పూజారి సత్యం సేకరించినట్లు ఈవో తిమ్మానాయుడు తెలిపారు.

మరో రెండు రోజులు నీటి సరఫరా బంద్

మార్టూరు, మే6 (ఆంధ్రజ్యోతి): మరో రెండురోజులు మార్టూరులో రక్షిత మంచినీటి సరఫరాకు ఆటకం ఏర్పడింది. చెరువునుంచి గ్రామంలో పంపిణీ చేసేందుకు నాలుగురోజుల నుంచి మండల కాంప్లెక్స్ వద్ద వంతెన క్రింద నూతనంగా పైపులైను వేస్తున్నారు. మరో రెండురోజులులో పనులు పూర్తయ్యే అవకాశం ఉంది. అందువలన రెండు రోజుల తర్వాత గ్రామంలో మంచినీటిని సరఫరా చేస్తామని పంచాయతీ ఈవో తన్నీరు శ్రీనివాసరావు మంగళవారం తెలిపారు. కార్యక్రమాలు పూర్తయిన తర్వాత ఫిల్టరుబెడ్లు మరమ్మతు చర్యలు చేపడతామన్నారు. అందుకోసం మైనింగ్ నిధులు రూ.31 లక్షలు మంజూరయ్యాయన్నారు. వాటితో ఫిల్టరు బెడ్లనుండి ఇసుకను తోడివేసి, మరల కొత్తగా ఇసుకను నింపుతామన్నారు.అంతేగాకుండా ఫిల్టరు బెడ్ల నుంచి కొంతమంది తాగునీటిని తీసుకువెళుతూ నీటిని కలుషితం చేస్తున్నారన్నారు. అందుకని ఫిల్టరు బెడ్లు చుట్టూ ఫెన్సింగ్‌ను ఏర్పాటుచేస్తామన్నారు. దీనికి తోడు అక్కడ మొక్కల పెంపకం చేపడతామన్నారు.